## సీఎం పర్యటన వాయిదా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన వాయిదా పడింది. గురువారం మధ్యాహ్నం 1 గంటకు పత్తికొండ నియోజకవర్గం లోని పుచ్చకాయలమడ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి హాజరవుతున్నారని ఆదేశాలు వచ్చాయి. అయితే గంటలోపే సీఎం పర్యటన వాయిదా పడిందని జిల్లా కలెక్టరేట్‌కు సమాచారం వచ్చింది.

## అభివృద్ధిని ప్రతిబింబించేలా మండల ప్రణాళికలు : కలెక్టర్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: అభివృద్ధిని ప్రతిబింబించేలా మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం స్వచ్ఛతాహి సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్సులో సమీక్షించారు.

★ మండల స్థాయి ప్రణాళికలను మొక్కుబడిగా కాకుండా తాగునీరు, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన తదితర అన్ని అంశాలను క్రోడీకరించి సమగ్రాభివృద్ధి దిశగా రూపొందించాలన్నారు. అదే తరహాలో జిల్లా స్థాయి ప్రణాళికలను రూపొందిస్తామని పేర్కొన్నారు.



★ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 4,876 కార్యక్రమాలు జరిగాయని, ఆలూరు, ఆస్పరి, మద్దికెర, పెద్దకడబూరు, తుగ్గలి మండలాలు వంద శాతం లక్ష్యాన్ని సాధించాయన్నారు.

★ జిల్లాలో ఇప్పటి వరకు 567 గ్రామసభలు నిర్వహించగా, అందులో 1.39 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారన్నారు.

★ 6.72 లక్షల స్టిక్కర్లు, 6.65 లక్షల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశామన్నారు.

★ 4,245 మంది విద్యార్థులు, 11,293 మంది రైతులు, 10,538 మంది సెల్ఫ్ ఎంప్లాయిడ్, బిజినెస్ వర్గాలు, 5,312 మంది ప్రైవేటు ఉద్యోగులు, 4,419 మంది ఇతరులు మొత్తం 45,656 మంది క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రణాళికల రూపకల్పనలపై తమ అభిప్రాయం తెలియజేశారని కలెక్టర్ పేర్కొన్నారు.



## వచ్చి మాట్లాడు..

# లేదంటే మంత్రొచ్చి తాళం వేస్తారు





కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్లో ఓ అధికారి బెదిరింపులతో ట్రేడర్లు వణికిపోతున్నారు. కార్యదర్శిక కంటే కింది స్థాయి హోదాలో ఉన్నా సదరు అధికారి గత వైకాపా పాలనలో అంతా తానై వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెదేపా నేతల పేర్లు చెప్పుకొంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు.. " వచ్చి మాట్లాడు కోండి.. లేదంటే మంత్రి టీజీ భరత్ వచ్చి మల్టిపుల్ గ్రేడింగ్ యంత్రం గోదాముకు తాళం వేయిస్తారని ఇటీవల బెదిరించడం చర్చనీయాంశంగా మారింది. రూ. లక్షలు ముట్టజెప్పి పనులు చేసుకో లేదంటే గోదామును మూయిస్తామని హుకూం జారీ చేయడం గమనార్హం. ఈ-నామ్ విధానం అమలవుతున్న మార్కెట్లకు కేంద్రం గ్రేడింగ్ యంత్రాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఏడాది కిందట రూ.56 లక్షలతో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు మల్టిపుల్ గ్రేడింగ్ యంత్రాన్ని తీసుకొచ్చారు. అద్దె ప్రాతిపదికన ఓ ట్రేడర్‌కు అప్పగించారు. నెలకు రూ.30 వేలు అద్దె చెల్లించేలా సదరు వ్యాపారి ఒప్పందం చేసుకొన్నారు. రైతులెవరూ ముందుకు రాకపోవడంతో మరో రూ.10 లక్షలు వెచ్చించి అదనపు పరికరాలు అమర్చారు. మూడు నెలల అద్దె చెల్లించాల్సి ఉంది. ఆ ట్రేడర్‌ను అధికారి బెదిరిస్తున్నారు.

## పొట్టవిప్పి చూడు..

■ ఆహారశాలలపై పర్యవేక్షణ కరవు
■ కల్తీ చేసి విక్రయిస్తున్న నిర్వాహకులు

# కల్తీ తిండి ఉండు




సర్వజన ఆసుపత్రికి వచ్చినవారు

| నెల | ఓపీ | ఐపీ |
|---|---|---|
| మే | 1,214 | 325 |
| జూన్ | 1,341 | 373 |
| జులై | 1,635 | 362 |
| ఆగస్టు | 1,185 | 296 |

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే:

▸▸ నగరానికి చెందిన మోహన్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నారు.. గత శని, ఆదివారం సెలవు కావడంతో సొంతూరొచ్చారు. స్నేహితులతో కలిసి మధ్యాహ్నం గుత్తి పెట్రోలు బంక్ వైపు ఉన్న హోటల్‌కు వెళ్లారు.. చికెన్ బిర్యానీ, గోబి తిన్నారు. రాత్రి అయ్యేసరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు.. మధ్యాహ్నం తిండి బాగా లేకపోవడంతో ఇలా అయ్యిందని వైద్యులు సూచించారు. ఆ రోజంతా చికిత్స పొంది రూ. 10 వేలు చెల్లించి డిశ్చార్జి అయ్యారు.

▸▸ నంద్యాలకు చెందిన రాహుల్ కుటుంబ సభ్యులు ఆసుపత్రికొచ్చారు. రెడ్‌క్రాస్ పక్కనున్న మొబైల్ క్యాంటీన్ వద్దకెళ్లి వడ, బోండా తిన్నారు. ఉదయమే వాంతులు, విరేచనాలతో పెద్దాసుపత్రిలోని అత్యవసర విభాగంలో చేరి వైద్యం చేయించుకున్నారు.

▸▸ వీరిద్దరే కాదూ.. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి నెలకు 1,300 మంది వరకు ఓపీ వస్తారు. వారిలో 40 శాతం మంది బయట ఆహారం తీసుకోవడంతో జీర్ణ సంబంధ జబ్బులతో వచ్చినవారే. ఇలాంటి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.. వీరంతా వ్యాధుల బారినపడి నరకయాతన అనుభవిస్తున్నారు. ఆహార పదార్థాలెన్నో కల్తీకి గురవుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తిరుపతి వేంకన్న లడ్డూలో కల్తీ నెయ్యి వాడటంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆహార పదార్థాల కల్తీపైనా కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు విన్నవిస్తున్నారు.

### రంగులద్ది.. తాజావని భ్రమింపజేసి..

● ఉపాధి, ఉద్యోగం, విద్య, వైద్యం తదితర అవసరాల నిమిత్తం పట్టణాలకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. హోటళ్లను ఆశ్రయించేవారూ క్రమంగా పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ బండ్ల సంఖ్య పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు కల్తీ చేస్తున్నారు.

● మాంసం, చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఆహారాన్ని రోజుల తరబడి ఫ్రిజ్‌లో ఉంచుతున్నారు. వినియోగదారులు కోరినప్పుడు వాటికి మసాలాలు దట్టించి, వేడివేడిగా వడ్డిస్తున్నారు.

● సాస్‌లు, బిర్యానీ, తందూరీ చికెన్లలోనూ కృత్రిమ రంగులు కలుపుతున్నారు. మిఠాయిలు, కేకులు, మసాలాలు, మాంసాహారానికి ఎరుపు రంగు, బంగాళాదుంప చిప్స్, పాప్‌కార్న్ వంటి వాటికి పసుపు రంగు, ఐస్‌క్రీమ్, సూప్‌లు, బఠానీలు తదితరాలకు నీలం, ఆకుపచ్చ రంగులు వాడుతున్నారు.

● కృత్రిమ రంగులు అద్దడం వల్ల అవి నాణ్యంగా, తాజాగా ఉన్నట్లు కనిపిస్తాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న వాటినీ తాజా పదార్థాలుగా భ్రమించి ఆరగించి వినియోగదారులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

**కల్తీ** చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. నయంకాని రుగ్మతలకు గురయ్యే ప్రమాదమూ ఉంటోందన్నారు.

**కృత్రిమ** రంగులు కలిపిన ఆహార పదార్థాలు ఎక్కువ కాలం తినడం వల్ల మనుషులు క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంది. పిల్లల్లో హైపర్ యాక్టివ్, అలర్జీ లక్షణాలు కనిపిస్తాయి. పురుషుల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్లతోపాటు జీర్ణకోశ వ్యాధులు, ఉబ్బసం వంటివి తలెత్తుతాయి. సింథటిక్ రంగులు స్త్రీల విషయంలో రుతుసంబంధ ఇబ్బందులు, మైగ్రేన్ తలనొప్పి, థైరాయిడ్, గర్భకోశ, కిడ్నీ, కాలేయ వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

"**హోటళ్లు,** రహదారులపై బజ్జీలు, సమోసాలు, చికెన్ పకోడ, గోబీ వంటి వాటిని పదేపదే కాచిన నూనెతో చేయడం హానికరం. ఇలాంటివి తినడం వల్ల మొదట గ్యాస్ట్రిక్ అల్సర్ తర్వాత క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని" గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణుడు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

### అధికారుల మొద్దు నిద్ర

● కల్తీకి అడ్డుకట్ట వేసేందుకు 'ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006' తీసుకొచ్చారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకం, వాడకం మొదలైన అంశాలకు సంబంధించి ఇది ప్రమాణాలను నిర్దేశిస్తోంది. 'భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)' ఈ చట్టం అమలును పర్యవేక్షిస్తోంది.


● హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార తయారీ, విక్రయ కేంద్రాల్లో అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ప్రమాదకర రంగులు వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లక్ష్యాలు నిర్దేశించుకొని నమూనాలు సేకరించి ఆహార కల్తీని, కృత్రిమ రంగుల వినియోగాన్ని అరికట్టాలి. కానీ ఈ చట్టాలేవీ సరిగ్గా అమలు కావడం లేదు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకొన్న హోటళ్లు 500 వరకు ఉన్నాయి.. అనుమతి లేనివి పది వేల వరకు ఉంటాయని అంచనా. వినియోగించే సరకులు, ఆహార పదార్థాల తయారీపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, నగరంలో కార్పొరేషన్ పరిధిలోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆరోగ్యాధికారి పర్యవేక్షించాలి. ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో పర్యవేక్షణ కావడం లేదు.

# తెల్ల బంగారానికి తేమ

■ క్వింటాలుకు రూ.500-700 తగ్గుదల

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఒక్కసారిగా ఆకాశం వైపు దూసుకెళ్లిన పత్తి ధరలు.. ప్రస్తుతం నేల చూపులు చూస్తున్నాయి. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. పది రోజుల కిందట క్వింటాలు పత్తి రూ.8,200 పలికింది. అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. పత్తి అమ్మకాలపై ఆసక్తి చూపారు. ఒక్కసారిగా క్వింటాలుపై రూ.500-700 ధర తగ్గుముఖం పట్టింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పండగల సీజన్ వస్తుండటంతో ధర ఉన్నప్పుడే అమ్ముకోవాలనే ఆలోచనతో రైతులు అధికంగా పత్తి దిగుబడులను మార్కెట్‌కు తెస్తున్నారు. అటు అతివృష్టి, అనావృష్టి, ఇటు ధరల పతనంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.




వారం రోజుల్లో క్వింటాలు పత్తి ధర గరిష్ఠంగా రూ.500-700 తగ్గాయి. ధరల పతనానికి తేమ శాతమే ప్రధాన కారణమని చెబుతున్నాయి మార్కెట్ వర్గాలు. నిజానికి తేమ శాతం 12-13 శాతం లోపు ఉండాలి. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న దిగుబడుల్లో 25 నుంచి 30 శాతం దాకా తేమ ఉంటోందంటున్నారు. సీజన్ ఆరంభం కాకముందే రోజు 10-12 వేల క్వింటాళ్ల దాకా రికార్డు స్థాయిలో పత్తి దిగుబడులు వస్తున్నాయి. వీటిలో సుమారు 60 శాతం దాకా తేమ దిగుబడులు ఉంటాయంటున్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో పరిస్థితులు తారుమారయ్యాయని పేర్కొంటున్నారు. పత్తి గింజలకు డిమాండ్ తగ్గి, దాని ప్రభావం దూదిపై పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. పది రోజుల కిందట పత్తి గింజలు క్వింటాలు ధర రూ.5,400 ఉండేది, ప్రస్తుతం రూ.4,400లకు పడిపోయింది. దూదిలో మైక్రోనర్ 3.7 నుంచి 4.1 వరకు ఉండాలి, అలాంటిది 4.9 నుంచి 5 దాకా ఉంటోందని పత్తి పరిశ్రమదారులు పేర్కొంటున్నారు. స్పిన్నింగ్ సమయంలో దారం తెగిపోతోందంటున్నారు. ఉత్పత్తి సమయంలో వస్త్రం రంగు మారి, డ్యామేజ్ క్లాత్‌లా మారిపోతుందంటున్నారు. వస్త్ర ఉత్పత్తిదారులు దూది కొనుగోళ్లకు ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తి తగ్గిందంటున్నారు. నాణ్యమైన దూది బేళ్లకు ధర బాగా ఉందని, ప్రస్తుతం బేల్ దూది ధర రూ.57 వేల వరకు పలుకుతోంది. ధరల పతనం ఎంతవరకు కొనసాగుతుందనేది అంచనా వేయలేమని చెబుతున్నారు.



## గమ్యం తప్పిన ప్రయాణం

వెంకాయపల్లి సమీపంలో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నచోట కనిపించని సూచికలు



నన్నూరు వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు

కర్నూలు శివారులోని నన్నూరు చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు కర్నూలు-గుంటూరు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పలు కూడళ్లలో వాహనాలను మళ్లిస్తున్నారు. కొన్ని చోట్ల సూచికలు లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి మధ్యలో అక్కడక్కడ పనులు చేపట్టారు. దీంతో అస్తవ్యస్తంగా మారింది. వెంకాయపల్లి వద్ద వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నా ఇక్కడ సూచికలు లేవు. నన్నూరు జాతీయ రహదారి వద్ద వాహన చోదకులు ఎదురెదురుగా ప్రయాణిస్తున్నారు. ఇక్కడ చుట్టూ తిరిగి రావాల్సి ఉన్నా వాహనాలు పట్టేంత దారి ఉంచడంతో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద సూచికలు లేకపోవడంతో ఇబ్బందిగా మారుతోంది. – ఈనాడు, కర్నూలు


కల్తీ నెయ్యి వినియోగంపై లోకాయుక్తకు ఫిర్యాదు ◆ ఆబ్కారీ శాఖ పునర్వ్యవస్థీకరణ ◆ ఈవోఆర్డీల బదిలీలు 6లో


## 7 పోస్టులు..

# 24 దరఖాస్తులు




కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లా విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షాలో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి పనులు, ఉపాధ్యాయుల పనితీరుతోపాటు కేజీబీవీల పర్యవేక్షణ పకడ్బందీగా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జీసీడీవో, సీఎంవోతోపాటు మరో ఐదు పోస్టులు భర్తీ చేసేందుకు జులైలో ప్రకటన విడుదల చేశారు. దీంతోపాటు సమగ్రశిక్షా ప్రాజెక్టు సమన్వయకర్త పోస్టు ఖాళీగా ఉంది. ఈ హోదాలో డీఈవో శామ్యూల్ ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టారు. వివిధ పోస్టులకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరగా 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 12 మంది అర్హత సాధించినట్లు తేల్చారు. ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పోస్టులు భర్తీ చేయలేదు. వీటిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

### జీసీడీవో పోస్టు కీలకం

కర్నూలు జిల్లాలో సుమారు 26 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్ రెండో ఏడాది వరకు సుమారు 6,641 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేజీబీవీల్లోనే వసతి సౌకర్యం ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు చేపట్టాలనే ఉద్దేశంతో ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయినిని జీసీడీవోగా డిప్యుటేషన్‌పై రెండు నెలల కిందట నియమించారు. ఆమె సైతం జీసీడీవో పోస్టుకు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. కేజీబీవీల్లో గత ఐదేళ్ల నుంచి ఉత్తీర్ణత సరిగా లేదు.

### ముందుకు కదలని దస్త్రం

గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీవో), ఐఈడీ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ అలెస్కోలకు సంబంధించి ఒక్కో పోస్టు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ రెండు పోస్టులను భర్తీ చేసేందుకు జులై 7వ తేదీన ప్రకటన ఇచ్చారు. రెండు నెలలు గడుస్తున్నా దస్త్రం ముందుకు కదలడం లేదు. ఈ పోస్టు భర్తీ అయితే ప్రభుత్వ బడులు, కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాలు ఉంటాయి. సమగ్రశిక్షాలోని ఓ అధికారి కాలయాపన చేస్తున్నారు.

## నిఘా విభాగానికి దగా




ఈనాడు, కర్నూలు: ప్రభుత్వ శాఖల్లో అక్రమాలపై విచారణలు చేసి తప్పిదాలు సవరించే విస్తృతాధికారాలున్న 'ప్రాంతీయ నిఘా, అమలు'(రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) అధికారి కార్యాలయం 'ఖాళీ' పోస్టులతో వెక్కిరిస్తోంది. ఈ కార్యాలయాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. 'కూటమి' ప్రభుత్వం పటిష్ఠ పరిచి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- పోలీసు విభాగం నుంచి కీలక నిర్ణయాలు తీసుకునే డీఎస్పీ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. ఏడుగురు కానిస్టేబుళ్లకు ఇద్దరే అందుబాటులో ఉన్నారు.
- ఇద్దరు వాణిజ్యపన్నులశాఖ అధికారులు (డీసీటీవో/ఏసీటీవో) ఉండాలి. మూడేళ్లపాటు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వాణిజ్యశాఖకు సంబంధించిన అక్రమాలు వెలుగుచూడలేదన్న విమర్శలున్నాయి.
- విజిలెన్స్‌లో ప్రత్యేకంగా సహజవనరుల విభాగం(నేచురల్ రిసోర్సెస్ వింగ్) ఉంది. వైకాపా హయాంలో రూ.వందల కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తరలించారు. ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండిపడుతున్నా చోద్యం చూశారు.
- అభివృద్ధి విభాగం (డెవలప్‌మెంట్ వింగ్)లో తహసీల్దారు, ఎంపీడీవో, ఏఏవో(అసిస్టెంట్ ఆడిట్ అధికారి), వ్యవసాయశాఖ అధికారి తదితరులుండాలి. ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉన్నా దాన్ని భర్తీ చేయలేదు.
- నిర్మాణాల్లో నాణ్యతా లోపాల్ని గుర్తించే బాధ్యతను ఇంజినీరింగ్ విభాగ అధికారులే చూసుకుంటారు. ఈ విభాగంలో ఒక డీఈఈ, ముగ్గురు ఏఈలు ఉండాలి. ఏఈ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది.
- నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత విజిలెన్స్ అధికారులపై ఉంది. మొక్కుబడిగా తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు.

# కాడితప్పిన రుణ సహకారం

■ కంప్యూటరీకరణ పేరుతో ఎగ్గొట్టారు
■ సీజన్ ముగుస్తున్నా 0.30 శాతమే




కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే : ఖరీఫ్ 'కాలం' చివరి దశకు చేరుకొంది.. ఇప్పటికీ రైతులకు రుణాలు అందించలేదు.. కంప్యూటరీకరణ పేరుతో సహకార బ్యాంకులు రుణ పంపిణీని పక్కన పెట్టేశాయి.. విసిగి వేశారిన రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తెచ్చుకొన్నారు. రూ.330 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని ఆప్కాబ్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు నిర్దేశించింది. ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకున్న సమయానికి పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, కౌలు రైతులు.. అన్ని రకాలు కలిపి రూ.1,00,59,000 మేర రుణాలను 70 మంది రైతులకు పంపిణీ చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 0.30 శాతం పురోగతి సాధించారు. కనీసం ఒక్క శాతం రుణం ఇవ్వకపోవడం గమనార్హం.

### లక్ష్యం రూ.300 కోట్లు ఇచ్చింది నలుగురికే!

● వ్యవసాయ, అనుబంధ శాఖలకు సహకార బ్యాంకు శాఖల ద్వారా దీర్ఘకాలిక రుణాలు (ఎల్‌టీ లోన్లు) ఇవ్వాల్సి ఉంది. పొట్టేళ్ల పెంపకం, పాడి గేదెలు, ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వ్యవసాయం, ఉద్యాన పంటలు, పట్టు సాగు తదితర వాటికి దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాకు రూ.300 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వచ్చినా కేవలం నలుగురు రైతులకు రూ. 33.69 లక్షలు ఇచ్చారు.

● ఈ ఏడాది షార్ట్ టర్మ్ రుణాల ఊసే లేకుండా పోయింది. ఎల్‌టీ రుణాలను రూ.100 కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెంచినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

### రూ.20 కోట్లు అన్నారు.. రూ.40.90 లక్షలు ఇచ్చారు!

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 6.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార బ్యాంకులు ఏటా ఒక్కో రైతుకు రూ.20 వేల నుంచి గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తుంటాయి. ఈ ఏడాది రూ.20 కోట్లు ఇవ్వాలని సహకార బ్యాంకు లక్ష్యాన్ని నిర్దేశించుకొంది. ఆగస్టులో పంట రుణాల లక్ష్యాలు నిర్దేశించగా ఇప్పటి వరకు కేవలం 44 మందికి రూ.40.90 లక్షలు ఇచ్చారు.

### పట్టించుకునే వారేరీ

▸▸ ప్రాథమిక సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు పాలక వర్గాలు లేవు. అధికారులే ఇన్‌ఛార్జి ఛైర్మన్లుగా కొనసాగుతున్నారు. పాలక వర్గాలు ఉండి ఉంటే రూ.100 కోట్లకు పైగా సహకార రుణాల పంపిణీ జరిగేవని అన్నదాతలు అంటున్నారు.

▸▸ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) డిజిటలైజేషన్ బాట పడుతున్నాయి. వచ్చే నెలాఖరుకు వంద శాతం ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

▸▸ సంఘాలకు అధ్యక్షులు లేకపోవడం.. సహకార అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కంప్యూటరీకరణపై దృష్టి సారించడంతో రుణాలిచ్చేవారే కరవయ్యారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. కర్నూలు జిల్లాలో 22,235 మందికి, నంద్యాల జిల్లాలో 27,780 మంది కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 44,877 మందికి కార్డులు పంపిణీ చేయగా మరో 5,775 మందికి ఇవ్వాల్సి ఉంది.

సాగు ధ్రువీకరణ పత్రాలు కలిగిన కౌలుదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.20 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్షకుపైగా పంట రుణాలు ఇవ్వాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఆప్కాబ్ ఆదేశాలు జారీ చేసింది.


ఉమ్మడి జిల్లాకు రూ.10 కోట్లను కౌలు రైతులకు ఇచ్చేందుకు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక సహకార సంఘాల్లో ఒక్క కౌలుదారుడికి పంట రుణాలు ఇవ్వలేదు. కేవలం ఒక్క పసుపల ప్రాథమిక సహకార సంఘంలో 22 మంది కౌలుదారులకు రూ.26 లక్షలు ఇచ్చారు.

## 15 మండలాల్లో వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో 15 మండలాల్లో వర్షం కురిసింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు కోసిగి మండలంలో 37.2 మి.మీ. వర్షం కురవగా, సి.బెళగల్ 28.0, మంత్రాలయం 22.6, నందవరం 15.4, హొళగుంద 13.0, ఎమ్మిగనూరు 12.8, కల్లూరు 9.8, కోడుమూరు 8.8, ఇక అత్యల్పంగా కర్నూలు అర్బన్‌లో 1.2, ఓర్వకల్లు 0.4, ఆదోని 0.2, మొత్తం 15 మండలాల్లో 159.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 6.1 మి.మీ. రికార్డయ్యింది. ఈ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ. కాగా ఇప్పటి వరకు 88.4 మి.మీ. వర్షం కురిసింది.

## కస్తూర్బా బాలిక.. విజయాల మాలిక

- లాక్రొసి క్రీడలో జాతీయ స్థాయికి ఎంపిక
- ఆదోని విద్యార్థినుల ప్రతిభ



ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే

చదువుతో పాటు ఆటల్లోనూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు ఆ విద్యార్థులు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ (జనరల్) బాలికల ఉన్నత పాఠశాలలో బి.అంజలి, జె.అఖిల తొమ్మిదో తరగతి చదువుతున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ శాంతి, వ్యాయామ ఉపాధ్యాయిని సునంద ప్రోత్సాహంతో కోచ్ అబ్దుల్ రసూల్ పర్యవేక్షణలో లాక్రొసి క్రీడలో రాణిస్తున్నారు. ఇటీవల డి.బెళగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ఈ ఇద్దరు క్రీడాకారిణిలు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఆగ్రాలో తమ సత్తా చాటేందుకు బయల్దేరి వెళ్లారు.

### అంజలి గెలుపు దారి



ఆదోని మండలం దిబ్బనకల్లుకు చెందిన ఐజాక్, కృష్ణవేణి దంపతుల కుమార్తె బి.అంజలి. చదువుతూనే మరోవైపు లాక్రొసి క్రీడలో రాణిస్తోంది. గత ఏడాదిగా శిక్షణలో మెలకువలు అందిపుచ్చుకుంది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. కోచ్ అబ్దుల్ రసూల్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటగలిగామని, జాతీయ స్థాయిలోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది అంజలి. ఉన్నత చదువులు చదివి పోలీసు అధికారిణిగా స్థిరపడి ప్రజలకు సేవ చేయాలనేదే తన లక్ష్యమని చెబుతోంది ఈ క్రీడాకారిణి.

### అఖిల.. భళా



ఆదోని పట్టణం బండిమెట్ట కాలనీకి చెందిన ప్రతాప్, పరిమళ దంపతుల కుమార్తె అఖిల. లాక్రొసి క్రీడలో సాధన చేస్తూ రాణిస్తోంది. బరిలో దిగితే జట్టు విజయానికి కృషి చేయడంలో దిట్ట. ఇటీవల డి.బెళగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెబుతోంది. మరోవైపు బాగా చదివి వైద్యురాలిగా స్థిరపడాలనేదే తన లక్ష్యమని అంటోంది క్రీడాకారిణి అఖిల.

## ఉల్లి క్వింటాల్ గరిష్ఠ ధర రూ.4,389

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పంట ఉత్పత్తుల ధరల వివరాలిలా ఉన్నాయి. మార్కెట్‌కు 3,720 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటాల్ కనిష్ఠ ధర రూ. 719, మధ్యస్థం రూ. 3,639, గరిష్ఠం రూ. 4,389 పలికింది. వేరుశనగకాయలు క్వింటాల్ రూ. 7,379, పూల విత్తనాలు రూ. 6,279, ఆముదాలు రూ. 5,962, కందులు రూ. 9,196, శనగలు రూ. 7,009, కొర్రలు రూ. 3,009, మినుములు రూ. 7,481, సజ్జలు రూ. 2,099కు వ్యాపారులు పంట ఉత్పత్తులను కొనుగోలు చేశారు.

## కల్తీ నెయ్యి వినియోగంపై లోకాయుక్తకు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న న్యాయవాది బి.మోహనకృష్ణ

ఈనాడు, కర్నూలు: తిరుమల తిరుపతి దేవస్థానంవారు లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని వినియోగించడంపై సమగ్ర విచారణ జరిపించాలని కర్నూలుకు చెందిన బి.మోహనకృష్ణ అనే న్యాయవాది లోకాయుక్తకు ఈ నెల 23న ఫిర్యాదు చేశారు. ఆయన గతంలో తిరుపతిలోని అవిలాల చెరువును ఇతర అవసరాలకు వినియోగించాలని నిర్ణయించడంపై జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో పోరాడి ఆ చెరువు భూములను కాపాడడంలో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన ఫిర్యాదు ప్రాధాన్యం సంతరించుకుంది. తితిదేకు గతంలో ఛైర్మన్లుగా వ్యవహరించిన భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పూర్వ ఈవో ఏవీ ధర్మారెడ్డిలను విచారించాలని సూచించారు. లోకాయుక్త స్వతంత్ర దర్యాప్తు సంస్థ అయిన నేపథ్యంలో ప్రభుత్వ విచారణకు సమాంతరంగా లోకాయుక్త విచారించాలని కోరారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యిని ఉపయోగించి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినడానికి కారకులైన వారిని ఉపేక్షించవద్దన్నారు. తిరుమల కేంద్రంగా జరిగిన అపచారానికి ప్రపంచ వ్యాప్తంగానున్న హిందువులందరూ తీవ్ర ఆందోళనకు, మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆ అపచారం జరగడం వెనక అవినీతి, అంతులేని నిర్లక్ష్యం ఉండడంతోపాటు ఆలయంపై వివక్షపూరితంగా కూడా వ్యవహరించారని తెలుస్తోందన్నారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో సోయాబీన్, పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెతోపాటు గొడ్డుమాంసం ముక్కల నుంచి తయారు చేసిన కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె ఉన్నట్లు ఎన్‌డీడీబీ కాఫ్ ల్యాబ్ నిర్ధారించిన నేపథ్యంలో అక్రమాలకు కారకులైన వారిని గుర్తించడానికి లోతైన దర్యాప్తు చేయించాలన్నారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా లడ్డూ పవిత్రతను, స్వచ్ఛతను అధికారులు పూర్తిగా భ్రష్టు పట్టించారని అర్థమవుతోందన్నారు.

## తరాలు మారినా.. మారని ప్రయాణం



కర్నూలు- బళ్లారి ప్రధాన రహదారిలో ఇలాంటి సాహసాలు నిత్యకృత్యం. వ్యవసాయ కూలీలు, ప్రయాణికులు నేటికీ ఆటోలు, ట్రాలీ టెంపోలను ఆశ్రయిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుంటారు. ఆస్పరి సమీపంలోని బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, ఇతర ప్రాంతాలకు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఆటో లోపల, టాప్‌పైనా, మరికొందరు వెనుక భాగంలో నిలబడి, కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. చిన్నపాటి ప్రమాదం జరిగినా పదుల సంఖ్యలో ప్రమాదాల బారిన పడక తప్పదు. - న్యూస్‌టుడే, ఆస్పరి



ఆదోని పట్టణంలో కొందరు విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఓ ఆటో వెనుకభాగంలో విద్యార్థులు కొందరు నిలబడి, వేలాడుతూ.. ప్రయాణం చేస్తున్నారు. ఇలాంటి ప్రయాణాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పోలీసులు చెబుతున్నా.. రవాణా సౌకర్యాలు లేక వెళ్లక తప్పడం లేదని చెబుతున్నారు. రవాణా, పోలీసు శాఖ అధికారులు ఆటో చోదకులకు అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

## ప్రజలు భాగస్వాములు కావాలి: కలెక్టర్



షెడ్ మిత్ర, క్లాప్ మిత్రలను సన్మానించిన కలెక్టర్ పి.రంజిత్ బాషా

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. కల్లూరు మండలంలోని చెట్లమల్లాపురం గ్రామంలో బుధవారం స్వచ్ఛతాహి సేవా, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల్లో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు అందజేయాలని, స్టిక్కర్లను ఇంటింటికి అతికించాలన్నారు. పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో అప్పటికి జిల్లా అభివృద్ధి సమగ్రంగా సాధించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించుకుంటున్నామన్నారు. పరిశుభ్రతపై గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలోని షెడ్ మిత్ర, క్లాప్ మిత్రలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ చల్లా కల్యాణి, చెట్లమల్లాపురం సర్పంచి భూపాల్‌రెడ్డి, ఎంపీపీ శారద, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే తెదేపా ధ్యేయం



పెద్దకడబూరులో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : రైతు సంక్షేమమే తెదేపా ధ్యేయమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. పెద్దకడబూరులో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దకడబూరు మండలంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంత్రాయలం తెదేపా నాయకుడు రాఘవేంద్రరెడ్డి, ఎంపీడీవో జనార్దన్, తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## హామీలు వంద రోజుల్లో నెరవేర్చిన చంద్రబాబు



ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సోమిశెట్టి, కార్పొరేటర్ మాణిక్యమ్మ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: చంద్రబాబు పరిపాలనాదక్షుడు కనుకనే ప్రజలకిచ్చిన హామీలను వంద రోజుల్లో నెరవేరుస్తున్నారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలో 45వ వార్డు లేబర్ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డు కార్పొరేటర్ మాణిక్యమ్మ, కె.రవికుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి తిరిగి స్టిక్కర్లు పంపించారు. కర్నూలు నియోజకవర్గంలో టి.జి భరత్ మంత్రిగా ప్రతి నిత్యం నగరాభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్, తెలుగు మహిళా కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు ముంతాజ్, తెదేపా నాయకులు సుంకన్న, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దిశానిర్దేశం చేయండి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలు, ర్యాగింగ్, రహదారి ప్రమాదాలు వంటి అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ చైతన్యపరచాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో కళాశాల యాజమాన్యాలు, ప్రధానాచార్యులు, విభాగాధిపతులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ పెంపొందించుకొని బాధ్యతాయుతంగా మెలిగేలా తీర్చిదిద్దాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడకుండా వారికి సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్‌నేరాలు, సామాజిక మాధ్యమాలు, బెట్టింగ్, జూదం వంటిపై చైతన్యపరచాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ఎస్సై ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు చేయూత



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న మాస్టర్ వీవర్స్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మిగనూరు మాస్టర్ వీవర్స్ సంఘం వారు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ చెక్కును బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ వీవర్స్ వెంకటేశు, చిన్నరంగన్న, పెద్దరంగన్న, రామలింగప్ప పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని హేమ రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ నగదును విజయవాడలో మంత్రి నారా లోకేశ్ మంగళవారం రాత్రి అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం ఎమ్మిగనూరు పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరకులు, ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు పాస్టర్ల సంఘం అధ్యక్షుడు రెవరెండ్ చిన్నబాబు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలో సేకరించిన చీరలు, టవర్స్, సంచులు, ప్లేట్లు ఇతర సరకులను 350 కిట్లుగా చేసి విజయవాడలోని వెంబ కాలనీ సింగనగర్ పున్నమి ఘాట్‌లో పంపిణీ చేసినట్లు చెప్పారు. సభ్యులు చిన్నబాబు, బీఎస్ ప్రసాద్, యోహాన్, బీఏ ప్రసాద్, సాలెం, సామెల్ పాల్గొన్నారు.



చెక్కును చూపుతున్న ఉపాధ్యాయ బృందం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : వరద బాధితులకు సహాయార్థం కౌతాళంలోని ప్రతిభ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.50 వేల విరాళం అందించారు. ఈ నగదును బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు మైనుద్దీన్, దూద్‌బాషా పాల్గొన్నారు.

## అర్హత పత్రాలతో హాజరు కావాలి

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు) న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టుకు ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు ఈ నెల 27వ తేదీన ఉదయం అర్హత పత్రాలతో డీఎస్ఏ స్టేడియంలో హాజరు కావాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎన్. గిడ్డయ్య, శివకుమార్‌లు బుధవారం సూచించారు. వివరాలకు 95041 43567 చరవాణికి సంప్రదించాలన్నారు.

## గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి ఎన్నికల షెడ్యూల్‌ను కర్నూలు డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.వి.దుర్గాప్రసన్న బాబు బుధవారం విడుదల చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఓటరు జాబితాను విడుదల చేశారు. మొత్తం 404 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలుంటే ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ నెల 26న ఎన్నికల ప్రకటన, వచ్చే నెల 5న నామినేషన్ల స్వీకరణ, 7న నామినేషన్ల పరిశీలన, 8న ఉపసంహరణ, అదే రోజు నికరమైన తుది జాబితా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 22న 12 మంది డైరెక్టర్ల స్థానాలకు, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి వివరించారు.

## ఈవోఆర్డీల బదిలీలు

- అంటకాగిన అధికారులకు అనుకున్న స్థానాలు
- పది మందికి అదే స్థానాల్లో కొనసాగింపు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఈవోఆర్డీల (మండల విస్తరణాధికారి) బదిలీల్లో నేతల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో వైకాపాకు అంటకాగిన ఈవోఆర్డీలకు తిరిగి ఆదాయం వచ్చే మండల కేంద్రాలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 53 మంది ఈవోఆర్డీలకుగాను 14 మందికి స్థాన చలనం కలిగింది, 10 మందిని తిరిగి అదే మండలాల్లో కొనసాగాలని ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారితో సన్నిహితంగా ఉన్న కొందరు ఈవోఆర్డీలకు అనుకూలమైన మండలాలు కేటాయించడంతోపాటు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించేలా ఒప్పందం చేసుకున్నారు. కర్నూలు జిల్లా నుంచి ఒక ఈవోఆర్డీని నంద్యాల జిల్లాకు బదిలీ చేసి, తిరిగి అక్కడ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. జిల్లాలో కౌతాళం, కృష్ణగిరి, ఆస్పరి మండలాలకు ఈవోఆర్డీలను నియమించలేదు. నంద్యాల జిల్లాలోని ఈవోఆర్డీల బదిలీల జాబితా విడుదల కాలేదు.

| ఈవోఆర్డీ | ప్రస్తుత మండలం | బదిలీ అయినది |
|---|---|---|
| ఎ.జనార్దన్ | పెద్దకడబూరు | ఆదోని |
| ప్రకాశ్‌నాయుడు | ఆలూరు | కోవెలకుంట్ల |
| సందీప్ | సి.బెళగల్ | నందవరం |
| సంజన్న | చిప్పగిరి | చిప్పగిరి (రిటన్షన్) |
| సూర్యనారాయణ | దేవనకొండ | దేవనకొండ " |
| జి.నాగేష్ | గోనెగండ్ల | కల్లూరు |
| మధులత | గూడూరు | గూడూరు (రిటన్షన్) |
| మల్లికార్జున | హాలహర్వి | బేతంచెర్ల |
| చంద్రమౌళీశ్వరగౌడ్ | హొళగుంద | పాణ్యం |
| రవికిశోర్ | కల్లూరు | వెల్దుర్తి |
| ఆర్.మంజుల | కోడుమూరు | కోడుమూరు (రిటన్షన్) |
| హరుణ్‌రషీద్ | కోసిగి | కోసిగి " |
| రామచంద్రారెడ్డి | కర్నూలు గ్రామీణం | కర్నూలు గ్రామీణం " |
| మద్దిలేటిస్వామి | మద్దికెర | మద్దికెర " |
| ప్రభావతిదేవి | మంత్రాలయం | మంత్రాలయం " |
| ఈశ్వరయ్య | నందవరం | సి.బెళగల్ |
| పీపీ సుబ్బరాయుడు | ఓర్వకల్లు | ఓర్వకల్లు (రిటన్షన్) |
| జయరాముడు | డోన్ | పెద్దకడబూరు |
| శ్రీహరి | కొలిమిగుండ్ల | తుగ్గలి |
| డి.నరసింహులు | వెల్దుర్తి | పత్తికొండ |
| విజయలక్ష్మి | ఎమ్మిగనూరు | ఎమ్మిగనూరు (రిటన్షన్) |
| అనంతశయన | వెలుగోడు | గోనెగండ్ల |
| చక్రవర్తి | జూపాడుబంగ్లా | హొళగుంద |

### ఎస్పీడీసీఎల్‌లో...

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్, తిరుపతి పరిధిలో భారీగా బదిలీలు జరిగాయి. సాధారణ బదిలీల్లో భాగంగా బుధవారం పలువురి సిబ్బందిని బదిలీచేస్తూ సీఎండీ కె.సంతోష్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలో పరిధిలోని ఈఈలు 31 మందిని బదిలీ చేశారు. డీఈఈలు 64 మంది, ఏఈలు 28, జేఈఈలు 2, ఏవోలు, ఏసీసీలు 2, ఏఏఓలు, ఏసీసీలు 19, జూనియర్ సహాయకులు 2, ఎస్‌వోఎస్ 1, జేఎల్‌ఎంలు 2, పీవో 1 మొత్తం 152 మందిని బదిలీ చేశారు.

## ఎంపీడీవోల స్థానచలనంపై సందిగ్ధం

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంపీడీవో బదిలీలపై సందిగ్ధం నెలకొంది. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డిల మధ్య నెలకొన్న మనస్పర్థలతో బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి రాలేదు. సీఈవో నెల రోజులపాటు సెలవులో వెళ్లేందుకు సిద్ధం కాగా, సీఎం పర్యటన దృష్ట్యా సెలవు రద్దు చేసుకున్నారు. వాస్తవానికి బుధవారం సీఈవో, ఛైర్మన్లు బదిలీలపై మరోసారి కసరత్తు చేసి తుది జాబితా విడుదల చేస్తారని అందరూ ఊహించారు. కానీ సీఈవో బుధవారం పత్తికొండలో పర్యటించడంతో ఛైర్మన్‌ను కలిసేందుకు అవకాశం లేకుండా పోయింది. బదిలీలపై ఏం చేద్దామనే అంశంపై ఇద్దరు కనీసం చరవాణిలో కూడా మాట్లాడుకోకపోవడంతో గురువారమైనా బదిలీల పంచాయితీ పూర్తవుతుందా లేక మళ్లీ మొదటికొస్తుందా..? అనే ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఎంపీడీవో బదిలీలపై స్పష్టత ఇచ్చి, నియామక ఆదేశాలు జారీ చేసే ప్రక్రియ చేపట్టాలని అసోసియేషన్ నేతలు గురువారం ఛైర్మన్‌ను కలువనున్నారు.

## ఆబ్కారీ శాఖ పునర్వ్యవస్థీకరణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి మద్యనిషేధ, ఆబ్కారీశాఖలో బదిలీలు మొదలయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం ఈ శాఖను అస్తవ్యస్తంగా మార్చిన సంగతి తెలిసిందే. పునర్వ్యవస్థీకరణ శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసి మద్యనిషేధ, అబ్కారీ శాఖలో విలీనం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అసిస్టెంట్ కమిషనర్, ఒక్కో జిల్లాకు ఒక పర్యవేక్షణాధికారి, మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ స్టేషన్లకు యథావిధిగా సీఐలను నియమించి శాఖపరమైన పరిపాలనను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది. శాఖలో దశల వారీగా బదిలీలను మొదలుపెట్టిన ఉన్నతాధికారులు మొదటగా జిల్లా స్థాయిలో ఉండే డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, పర్యవేక్షణాధికారులకు స్థాన చలనం కలిగించారు. మలి విడతలో సహాయ పర్యవేక్షణాధికారులు, సీఐలు, ఎస్సైలను బదిలీ చేసి చివరగా హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేయనున్నారని తెలిసింది.

### జిల్లా ఉన్నతాధికారుల నియామకం పూర్తి

ఉమ్మడి జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పి.శ్రీదేవిని నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఉన్న ఈమెను ఈ స్థానానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడున్న డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఏలూరుకు బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావును కర్నూలు జిల్లాకు నియమించారు. నంద్యాలలో అసిస్టెంట్ కమిషనర్ మధుమోహన్‌రావు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. కర్నూలు పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబును యథాస్థానంలో కొనసాగించనున్నారు. కర్నూలు మరో పర్యవేక్షణాధికారి రవికుమార్‌ను నంద్యాలకు బదిలీ చేసి అక్కడ పని చేస్తున్న పర్యవేక్షణాధికారి బి.రామ్మోహన్‌రెడ్డిని అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. పోస్టింగుల కోసం సహాయ పర్యవేక్షణాధికారులు, సీఐలు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు పత్రాలు సమర్పించారు. బదిలీ వ్యవహారంలో బార్ల యజమానులు జోక్యం చేసుకుని ప్రజాప్రతినిధుల సిఫారసు పత్రాలు ఇప్పించడం గమనార్హం.


### సిబ్బందికి దిగులు

మద్య నిషేధ, అబ్కారీ శాఖలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లకు బదిలీ దిగులు పట్టుకుంది. ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు స్థాన చలనం కలిగించనున్నారు. ఐదు అవకాశాలు ఇచ్చి ఎంపిక చేసుకునే విధానంలో బదిలీ చేయనున్నారు. విద్యా సంవత్సరం ఆరంభమైన నాలుగు నెలల తర్వాత బదిలీ భారంగా మారింది. మరో ప్రాంతానికి వెళ్తే ఇబ్బందులు పడతామని వాపోతున్నారు. చెక్‌పోస్టుల్లోని సిబ్బంది మాత్రం బదిలీ కోరుకుంటున్నారు.

### 188 దుకాణాల అనుమతులకు ప్రకటన!

ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగించి కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకే అనుమతులు ఇవ్వనుంది. మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించిన ప్రకటన ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేయనుంది. కర్నూలు జిల్లాలో 90 మద్యం దుకాణాలు (7 దుకాణాలు గౌడ కులస్తులకు), నంద్యాల జిల్లాలో 98 (5 దుకాణాలు గౌడ కులస్తులకు) దుకాణాల అనుమతులకు ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది. ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించి లక్కీడిప్ విధానంలో అనుమతులు కేటాయించే విధానం అమలు చేయనున్నారు.

## అగ్నిమాపకశాఖ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని ఓ సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లా విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ సేవల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా శివరామిరెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా అవినాశ్‌లు వ్యవహరించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ (కర్నూలు) ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు(బనగానపల్లె), కార్యదర్శిగా కె.ప్రతాప్(కర్నూలు), సంయుక్త కార్యదర్శిగా వై.గోపాల్(ఎమ్మిగనూరు), కోశాధికారిగా ఎం.నాగరాజు(ఆళ్లగడ్డ), సలహాదారుగా డి.శివకుళ్లాయప్ప(నంద్యాల) ఎన్నికయ్యారు. ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారి అవినాశ్ జయసింహాలు శుభాకాంక్షలు తెలిపారు.

## సహకార సంఘాల కంప్యూటరీకరణ వేగవంతం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణను వేగవంతం చేయాలని జేసీ డా.బి.నవ్య ఆదేశించారు. స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని ఓ హోటల్‌లో జేసీ, పీఐసీ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన సీఈవోలు, బ్యాంకు, సహకార శాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పసుపల, సి.బెళగల్ సహకార సంఘాలతో పాటు అన్ని సంఘాలను సీబీఎస్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు, బ్యాంకు సీఈవో విజయకుమార్, బ్యాంకు జీఎం పి.రామాంజనేయులు, డీజీఎంలు బి.సునీల్‌కుమార్, బీవీ.నాగిరెడ్డి పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్ మోసంపై మహిళపై కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ల్యాప్‌టాప్‌తో మోసగించిన కర్నూలు పాత బస్టాండుకు చెందిన అశ్విని అనే మహిళపై కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. నిందితురాలు ఆన్‌లైన్ ద్వారా ఇన్‌స్టాకార్ట్ సర్వీసు సంస్థ నుంచి రూ.3,39,990 విలువ చేసే ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసింది. అనంతరం ల్యాప్‌టాప్ పనిచేయడం లేదంటూ తిరిగి సంస్థకు అప్పగించడంతో నిందితురాలు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు ల్యాప్‌టాప్‌ను పరిశీలించగా.. ఆమె అప్పగించిన ల్యాప్‌టాప్ నకిలీదని గుర్తించారు. సంస్థ ప్రతినిధి కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కర్నూలు రెండో పట్టణ పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

## దిల్లీ దర్గా పీఠాధిపతితో భేటీ


దిల్లీ పీఠాధిపతితో అవ్వ బ్యాంకు పెద్దలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: దిల్లీ దర్గా పీఠాధిపతి సయ్యద్ మహమ్మద్ నిజామితో ఆదోని మహాయోగి లక్ష్మమ్మవ్వ కో-ఆపరేటివ్ బ్యాంకు బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ ఛైర్మన్ రాచోటిసుబ్బయ్య బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆదోని పర్యటనకు వచ్చిన ఆయనను ఫరిసామొహల్లా ప్రాంతంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. వెంట మైనార్టీ నాయకులు నసీరుద్దీన్ పటేల్, ఖలీద్‌నిజామి, ఇక్బాల్ నిజామి తదితరులున్నారు.

## వసతులు కల్పించాలని వినతి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనరు పగడాల రమేశ్ డిమాండు చేశారు. కాలనీలో బుధవారం పర్యటించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారథికి నాయకులు, కాలనీ వాసులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, సాయి, యోహాన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆలూరు, న్యూస్‌టుడే: **సమస్య:** ఆలూరు మండలం అరికెర గ్రామంలోని హొళగుంద వెళ్లే మార్గంలోని మలుపు ప్రమాదకరంగా మారింది. ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలి. **- అక్బర్, అరికెర**

**సమాధానం:** మలుపు తిరిగే రహదారి వద్ద వేగని యంత్రికలు ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, సర్పంచి, అరికెర**

ఆస్పరి, న్యూస్‌టుడే: **సమస్య:** ముత్తుకూరులో శ్మశాన వాటిక లేక రహదారి పక్కనే ఖననం చేస్తున్నారు. స్థలం కేటాయిస్తే ఇబ్బందులు తప్పుతాయన్నారు.
**- హనుమంతు, ముత్తుకూరు**

**సమాధానం:** శ్మశాన వాటిక కోసం స్థలం కావాలని పలుమార్లు మా దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని తహసీల్దారుకు కూడా వివరించాం.
**- హరికృష్ణ, వీఆర్వో, ముత్తుకూరు**

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెరలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద ఉన్న చెట్లు విద్యుత్తు లైనుకు అడ్డుగా మారాయి. వాటిని తొలగించాలి.
**- చంద్రహరి, మద్దికెర**

**సమాధానం:** పరిశీలించి చెట్లు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.
**- రఫీక్, విద్యుత్తు ఏఈ, మద్దికెర**

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణం మాధవరం రహదారిలో చెత్త కుప్పలు అధికంగా ఉన్నాయి. శుభ్రత పనులు చేపట్టాలి. **- మారుతి, ఆదోని**

**సమాధానం:** ఆ ప్రాంతంలో పర్యటించి, సమస్య పరిశీలించి పరిష్కరిస్తాం.
**- ఎం.కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

## పల్లె కబుర్లు

ఉప్పరపల్లి(తుగ్గలి), న్యూస్‌టుడే: ఉప్పర్లపల్లి, మీటెతండా, సూర్యతండా గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రత్యేకాధికారులు పశువైద్యాధికారి ప్రణీత, వెలుగు ఏపీఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు అప్పా వేణు, రాముడునాయక్, మనోహర్, సచివాలయం సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది విశ్వనాథ్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతుంబళం(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: పెద్దతుంబళం గ్రామంలో మధ్యాహ్నం సమయంలో పొలంలో పిడుగు పడడంతో ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన హనుమయ్య, అతని అక్క కూతురు నాగవేణి పొలంలో పత్తి తీస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో పొలం పక్కన ఉన్న తాటి చెట్టు వద్దకు వెళ్లి నిల్చున్నారు. సమీపంలో పిడుగు పడటంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

యడవలి(మద్దికెర), న్యూస్‌టుడే: యడవలిలో ఓ ఇంట్లో చోరీ చేసేందుకు యువకులు యత్నించారు. గ్రామానికి చెందిన రంగన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు తాళం తీస్తుండగా.. స్థానికులు పట్టుకునేందుకు యత్నించగా వారు ఉడాయించారు. వారిని పట్టుకునేందుకు యత్నించినా దొరకలేదని గ్రామస్థులు తెలిపారు.

# దారులు దారుణం.. సాగని ప్రయాణం

అంతా గోతుల మయం | ప్రమాదాలతో సతమతం

గమ్యం చేరాలంటే.. గండాలు దాటాలి. దారులు భయపెడుతున్నాయి. అడుగడుగునా గోతులే ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రమాదాలను తప్పించుకుని.. ప్రాణాలతో బయటపడితే చాలు అన్నంత అధ్వానంగా మారాయి పల్లెదారులు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. వాహనదారులకు శాపంగా మారింది. పశ్చిమ ప్రాంతంలో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. వాహనదారులకు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. - న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం, ఆస్పరి,

రహదారి | దూరం | గుంతలు

ఆస్పరి నుంచి ఆలూరు | 22 కి.మీ. | 300

ఇదీ పరిస్థితి: చిన్నహోతూరు వరకు రహదారి బాగానే ఉన్నా.. అక్కడి నుంచి ఆలూరు వరకు అన్నీ గోతులే దర్శనమిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం రహదారులపై శ్రద్ధ చూపకపోవడంతో ప్రయాణికులకు, వాహనదారులకు గండాలు చుట్టుముట్టాయి. ఏమాత్రం ఏమరపాటుగా వెళ్లినా.. ఇల్లు చేరేబదులు ఆసుపత్రికి వెళ్లాల్సిందేనని రోజూ ప్రయాణించే వారు చెబుతున్నారు.



ఛత్రగుడి నుంచి మోకా వరకు | 4 కి.మీ. | భారీగా ఆరు చోట్ల

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండల కేంద్రం శివారులోని ఛత్రగుడి నుంచి మోకా వెళ్లే రహదారి గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీన్ని గతంలో కొందరు మట్టి వేసి పూడ్చినా.. ఫలితం లేకుండా పోయింది. మధ్యలో గుంత ఉండటంతో కొందరు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. హెచ్చరికగా చిన్నపాటి రాళ్లు ఉంచారు. రహదారి గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.



ఇదీ పరిస్థితి: ఆస్పరి నుంచి ఆదోని రహదారిలో బిణిగేర గ్రామంలో సుమారు ఆరు చోట్ల ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



ఆస్పరి నుంచి ఆదోని | 21 కి.మీ. | 10 గుంతలు

## దిమ్మె నిర్మించి.. ప్రమాదాలు తప్పించి

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో కర్నూలు- బళ్లారి ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక సమస్యపై 'ఈనాడు'లో జులైలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి దిమ్మె నిర్మించి, దానిపై విద్యుత్తు నియంత్రికలను ఏర్పాటు చేశారు. సమస్యపై సంబంధిత విద్యుత్తు అధికారులు స్పందించి దిమ్మె నిర్మాణం చేపట్టారు.

స్పందనకు వందనం

## గుంతలు పూడ్చారు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట తాగునీటి పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంతను పురపాలక సంఘం సిబ్బంది పూడ్చివేశారు. రహదారిపై ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయని గత వారం 'ఈనాడు'లో 'ప్రమాదకరమైన 'గుంత' తవ్వి.. మరమ్మతు మరచి' అనే కథనానికి పురపాలక అధికారులు స్పందించారు. గుంతలు పూడ్చివేసి ప్రమాదాలు నివారించారు.

## కళాశాల ఆవరణలోనే వసతిగృహం ఏర్పాటు చేయాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలోనే వసతిగృహం ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థినులు బుధవారం ఆందోళన చేపట్టారు. స్థానిక కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి భీమాస్ కూడలిలో రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, రఘు, వరుణ్‌తేజ్, కిరణ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


ఆదోనిలో రాస్తారోకో చేస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థినులు

## దీన్‌దయాళ్ ఆశయాలు సాధిద్దాం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో భాజపా ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర సభ్యుడు విట్టా రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాసాచారి, ఉలింద్ర, మోహన్, మహేష్, రాజేష్, చిన్న, రవి, అభిరామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా హొళగుందలోని విరక్తి మఠంలో భాజపా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. నాయకులు ప్రసాద్, చిదానంద్, వీరేష్, మహేష్, ఉలిగన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ ఏకాత్మతా మానవతా సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ జయంతిని భాజపా నాయకులు బుధవారం పత్తికొండలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, సీసీ రంగస్వామి రామ్మోహన్, దండి మల్లికార్జున, గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

క్రైం కార్నర్

ముద్దనగేరి(ఆలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: విద్యుత్తు మోటారు ప్లగ్ పెట్టే సమయంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన ముద్దనగేరి గ్రామంలో బుధవారం జరిగింది. ముద్దనగేరికి చెందిన శ్రీనివాసులు (30) ఆలూరులో ఓ పెట్రోలు బంకులో పనిచేస్తున్నారు. ముద్దనగేరిలోని ఇంట్లో మధ్యాహ్న సమయంలో కుళాయిల్లో నీరు సఫరా చేశారు. మోటారుతో నీటిని పట్టేందుకు ప్లగ్ పెడుతుండగా.. విద్యుదాఘాతంతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. కుటుంబసభ్యులు 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్తు తీగల దొంగ అరెస్టు

విరుపాపురం(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని విద్యుత్తు శాఖ కార్యాలయంలో చోరీకి పాల్పడిన విద్యుత్తు తీగల దొంగను ఆదోని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సూర్యమోహన్ రావు తెలిపారు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని విద్యుత్తు శాఖ కార్యాలయంలోని గోదాంలో రాగి విద్యుత్తు తీగలు చోరీకి గురైనట్లు విద్యుత్తు శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేపట్టారు. ఆదోని మండలం విరుపాపురం గ్రామానికి చెందిన దస్తగిరి చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. అరెస్టు చేసి, అతని నుంచి రూ.30 వేలు విలువ చేసే 29 కిలోల రాగి తీగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు ఆంజనేయులు, రమేశ్‌ను సీఐ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: 44వ జాతీయ రహదారిలోని వెల్దుర్తి నుంచి డోన్‌కు వెళ్లే రైల్వేగేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకన్న గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న అతని వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని 108 అంబులెన్సు సిబ్బంది యూనిష్‌బాషా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.

## వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ.. ఆరోగ్యానికి తోడ్పాటు అందించడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఆవోపా పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా, దాత, ఎన్ఆర్ఐ కాకుబాల్ నగేష్‌కుమార్ తెలిపారు. వాసవి కల్యాణ మండపంలో బుధవారం ఆవోపా, ఆర్యవైశ్య మహాసభ, సంయుక్త ఆధ్వర్యంలో శాంతిరామ్ ఆస్పత్రి, పూర్ణిమా వైద్య కళాశాల, నిసర్గ ఆయుర్వేద ఆస్పత్రి, ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ, సహకారంతో కంటి, పంటి, ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు రఘు, వెంకటేశ్వర్లు, వెంకటేష్ బాబు, ప్రతాప్‌ఈరన్నశెట్టి, రవి, విశ్వనాథ్, మమతాశ్రీ, సంగీత, హిమబిందు, గీత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సంఘ పెద్దలు


ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ములుగుందం, ఆస్పరి, న్యూస్‌టుడే: ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రయోజకుడిని చేయాలని ఎంఈవో తిరుమలరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎల్లప్ప ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో తిరుమలరావు, జిల్లా పరిషత్తు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్‌మియా, శోభరాణి పలువురు స్థానిక పాఠశాలలో ఎల్లప్పను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరామపుల్లయ్య, నాగరాజు, లక్ష్మన్న, ఈశ్వరరావు, సురేష్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను చుట్టుముట్టిన కాలనీవాసులు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో శంకరనగర్‌లో ఆక్రమణల తొలగింపు పనులు నిలిపివేయాలని స్థానికులు ఎమ్మెల్యే పార్థసారథిని బుధవారం అడ్డుకున్నారు. వార్డులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం అనంతరం తిరిగి వెళ్తుండగా అడ్డుకున్నారు. తమ ఇళ్ల ముందు బండలు, నిర్మాణాలు తొలగిస్తున్నారని, పేదల ఇళ్లపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. తొలగింపు ప్రాంతాలను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. 60 అడుగుల రహదారిని ఆక్రమించి బండలు వేసుకుని, ఇళ్లలో కలిపేసుకున్నారని, వాటిని మాత్రమే తొలగిస్తున్నామన్నారు. రహదారుల విస్తరించడం వల్ల కాలనీ అభివృద్ధి చెందుతుందని, ఇలాంటి పనులను అడ్డుకోవడం సరికాదని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.


ఎమ్మెల్యే ఎదుట తమ సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

## ఓటర్లు అధికంగా ఉంటే.. అదనపు కేంద్రం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల సంఖ్య 1500 దాటితే.. అదనపు కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మార్పులు, చేర్పులపై అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశంలో తహసీల్దారు శివరాముడు, ఎన్నికల ఉప తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, [illegible] కార్యాలయ పరిపాలన అధికారి [illegible], రాజకీయ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

## మానవత్వంతో వరద సాయం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొనడం అభినందనీయమని వక్తలు అన్నారు. వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొని విజయవాడ నుంచి ఆదోనికి చేరిన 110 మంది పురపాలక ప్రజారోగ్య కార్మికులను గ్లోబల్ సర్వీస్ సొసైటీ సంస్థ బుధవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర సభ్యుడు విట్టా రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ. నాగరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రాజు, హుసేని, షేక్షావలి, జయరాజు, లక్ష్మన్న, జాన్, తదితరులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన ప్రజారోగ్య కార్మికులు

## అందరి శ్రమతోనే గెలిచారన్నది మరవద్దు

పెద్దతుంబళం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి గెలుపు కోసం మీనాక్షినాయుడు, నేను, నాయకులందరూ రాత్రి, పగలు కష్టపడి పనిచేశామని ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ జైన్ అన్నారు. పెద్దతుంబళం గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుతో పాటు ఆయన పాల్గొన్నారు. ప్రకాశ్ జైన్ ఎమ్మెల్యే పార్థసారథిపై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే ప్రజల కోసం పనిచేయాలని సూచించారు.

## ఏబీ బర్ధన్ సేవలు చిరస్మరణీయం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ సీనియర్ నాయకుడు పి.భీమలింగప్ప అన్నారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పత్తికొండ సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు రాజాసాహెబ్, రామాంజనేయులు, పెద్దవీరన్న, సుల్తాన్, నెట్టేకంఠయ్య, ఎంకే సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: గర్భిణులకు పౌష్టికాహారం అందించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ స్వయంప్రభ అన్నారు. ఆదోని పట్టణంలోని లంగరబావివీధి-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. పాల్గొన్ని గర్భవతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో పాటు వైద్యసేవలను వివరించారు. ఎమ్మెస్‌కేలు పాల్గొన్నారు.

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, నాగేశ్వరమ్మ, సౌభాగ్యలక్ష్మి అన్నారు. పత్తికొండ పట్టణంలో బుధవారం అంగన్‌వాడీ సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమామహేశ్వరి

హుళేబీడు(ఆలూరు), న్యూస్‌టుడే: హుళేబీడు గ్రామం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన వంట గది మరమ్మతు కోసం గ్రామ సర్పంచి మంజమ్మ రూ.20 వేలు అందించారు. బుధవారం పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడు మదర్‌సాబ్, కమిటీ ఛైర్మన్ పరమేశ్‌కు నగదు అందజేశారు. కాలనీ వాసులు కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

### 2 ముక్కల్లో..

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆదోని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ పద్మజ అన్నారు. ఆదోని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈగా పద్మజ బాధ్యతలు చేపట్టారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: బసాపురం గ్రామానికి చెందిన పార్వతిని అరెస్టు చేసి, ఆమె నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర బుధవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అల్లుగుండు(వెల్దుర్తి), న్యూస్‌టుడే: అల్లుగుండు ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత హిందీ ఉపాధ్యాయిని స్వయంప్రభ భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. భగవద్గీత పఠనంతో విద్యార్థుల్లో ఉన్నత భావాలు, జ్ఞానం పెంపొందుతాయన్నారు.

# సాకులు చూపి.. సౌకర్యాలు మరచి

☛ వాణిజ్య ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు
☛ సులభ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుతో ఉపశమనం


తొలగించిన దుకాణాల ఆక్రమణలు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సౌకర్యాలు కల్పించమంటే.. సాకులు చూపుతూ దాటవేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు కనీస అవసరాలు తీర్చుకోవాలన్నా.. కష్టమే. ఆదోని పట్టణంలోని ఇలాంటి సమస్యల నుంచి బయట పడేందుకు మార్గం సుగమం అయింది. పట్టణంలో పురపాలక, ప్రభుత్వ స్థలాల ఆక్రమలపై దృష్టి సారించారు. ఆక్రమణలు తొలగించి అత్యవసరాలు తీర్చే సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టనున్నారు.

### వచ్చే వారికి ఇబ్బందులే..

పట్టణ నడిబొడ్డున ఉన్న జీబీ.సముదాయం ప్రాంతంలో కబ్జా చేసి ఏళ్లుగా అనుభవిస్తున్న రూ.లక్షలు విలువ చేసే పురపాలక స్థలాన్ని ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి ప్రాంతంలో బంగారు బజారు, ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, వస్త్ర మార్కెట్, కంచిగారి వీధి, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరికరాల అమ్మకాల దుకాణాలు, ప్రింటింగ్ ప్రెస్‌లు ఉన్నాయి. నిత్యం వందల మందితో కిటకిటలాడుతుంది. వివిధ ప్రాంతాల నుంచి జనం కొనుగోలు నిమిత్తం వస్తుంటారు. అలా వచ్చిన వారికి కనీస సౌకర్యాలు లేక గంటల తరబడి మలమూత్రాలు విసర్జించకుండా ఇబ్బందులు పడుతున్నారు. సామూహిక శౌచలయం నిర్మించాలని వ్యాపారులు ఏళ్ల తరబడి కోరుతున్నారు. స్థలం లేదని సాకుగా చూపుతూ వచ్చారు. రాజకీయ అండదండలతో స్థలాలు ఆక్రమించారు. వాటిని తొలగించేందుకు అధికారులు వెనకడుగు వేశారు.

### గతంలో ప్రతిపాదనలోనే సరి

| | |
|---|---|
| ఆదోనిలో వాణిజ్య ప్రాంతాలు: 12 | |
| ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ప్రాంతాలు: 10 | |
| సులభ్ కాంప్లెక్స్‌లు: 05 | |
| రోజూ పట్టణానికి వచ్చే జనం: 30 వేలు పైనే | |

గత వైకాపా ప్రభుత్వంలో పట్టణంలో మూడు చోట్ల గ్రీన్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని భావించారు. ఒక్కో దానికి రూ.10-12 లక్షలు ఖర్చు చేయాలని భావించారు. ఒకటి ఎమ్మిగనూరు రహదారి మలుపులో ఏర్పాటు చేసినా.. ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడి ప్రాంతంలో శౌచాలయం లేక జనం రహదారుల పక్కనే మురుగు కాలువలోనే మూత్ర విసర్జన చేస్తుండటం వల్ల అపరిశుభ్రంగా మారుతోంది. మరో రెండు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. నేటికీ ఆచరణలోకి రాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి వీటి సేవలను వినియోగంలోకి తీసుకురావాలని జనం కోరుతున్నారు.

### నిర్మాణాలు కూలుస్తూ..

ప్రస్తుత ఎమ్మెల్యే చొరవతో పాటు కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. వీటిలో మహిళలు, పురుషులకు సులభ్ సముదాయం నిర్మించాలనే దిశగా ముందుకు సాగుతున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులతో కూడిన గ్రీన్ టాయిలెట్స్ నిర్మించనున్నారు. దీంతో వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జనాలకు ఎంతో వెసులుబాటుగా కలగనుంది. ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

## మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్‌కుమార్ డిమాండు చేశారు. బుధవారం కళాశాలలో మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు రాహుల్, కార్యదర్శిగా సురేంద్రతో పాటు 12మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శనగ విత్తనాలు అందించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: రబీ నేపథ్యంలో అన్నదాతలకు సకాలంలో రాయితీ శనగ విత్తనాలు అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి అగ్రహారం ఈరన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి కోరారు. శనగ విత్తనాలు అందించాలని కోరుతూ బుధవారం ఆలూరులో తహసీల్దారు గోవిందు సింగ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శాకీర్, కృష్ణ, పరమేష్‌గౌడ్, శేకన్న, రామాంజి, మైన పాల్గొన్నారు.

## వైకాపా నుంచి తెదేపాలో చేరిక

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోనిలో 19 వార్డు మండిగిరి వైకాపాకు చెందిన 20 కుటుంబాలు బుధవారం తెదేపాలో చేరాయి. ఆదోని తెదేపా బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సమక్షంలో వైకాపా నుంచి తెదేపాలో చేరారు. రహిమాన్, బాలు, లక్ష్మణ్, పవన్, సూరి, మహిళలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. తెదేపా వార్డు బాధ్యుడు శ్రీనివాస ఆచారి, నాయకులు ధర్మ, రవి, ముని, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, రంగస్వామి నాయుడు, భూపాల్ చౌదరిని కలిశారు.

## రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు డిమాండు చేశారు. ఆదోని తహసీల్దారు శివరాముడుకు బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, నాయకులు హనుమంత రెడ్డి, మునిస్వామి, ఉశేన్, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

## వేదవతి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిచేయాలి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టుతోనే సస్యశ్యామలం అవుతుందని, వెంటనే నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దహోతూరులో నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. పెద్దహోతూరు సీపీఐ కార్యదర్శిగా రాముడు, సహాయ కార్యదర్శిగా వన్నూరువలితో పాటు 21 మందితో ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రామంజనేయులు, సిద్దలింగ, షేక్షావలి, సుభాన్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

## సమాజ సేవకు కృషి చేయాలి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపక బృందం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఫార్మాసిస్ట్ పాత్ర కీలకమైందని, యువత సమాజసేవ కోసం కృషి చేయాలని ప్రధానాచార్యుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు ఎర్రకోట సెయింట్ జాన్స్ ఫార్మాసిస్ట్ కళాశాలలో ఫార్మాసిస్ట్ దినోత్సవం బుధవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ వాగేశ్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాజశేఖర్, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 2న ఉద్యోగ మేళా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఎమ్మిగనూరు జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అక్టోబరు 4 తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. దాదాపు 17 కంపెనీలు వస్తున్నాయన్నారు. ఏడో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన విద్యార్థులు అర్హులన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794 కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు, న్యూస్‌టుడే :

సమస్య : మండలంలోని హెచ్.మురవణి గ్రామంలోని పలు కాలనీల్లో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. - గ్రామస్థులు

సమాధానం : సమస్యను పరిష్కారానికి కృషి చేస్తాం.

- జనార్దన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

## చెత్త సంపద కేంద్రం ప్రారంభం

మారందొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే : మండలంలోని మారందొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీవో రాముడు బుధవారం ప్రారంభించారు. అంతక ముందు ఆయన మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. స్వచ్ఛతాహి సేవా



మారందొడ్డిలో చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాముడు

కార్యక్రమంలో భాగంగా ఈసీ పృథ్వీరాజ్ చొరవతో ఉపాధి నిధులతో ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సందీప్, ఏపీవో రామన్న, సర్పంచి శాంతమ్మ, హరితరాయబారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పండ్లతోటల పెంపకంపై అవగాహన

సి.బెళగల్, న్యూస్‌టుడే : మండలంలోని రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఏపీవో రామన్న పేర్కొన్నారు. సి.బెళగల్‌లో ఈసీ పృథ్వీరాజ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన డ్వామా సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్లతోటల పెంపకం చేపట్టిన రైతులకు త్వరగా బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులు 90 దినాలు గుర్తించి పనులు చేయించాలని సూచనలు ఇచ్చారు. పశుపోషకులకు గోకులషెడ్లు గుర్తించి మంజూరైన పనులకు శ్రీకారం చుట్టాలన్నారు.

# టెండర్లు వేస్తారు.. వదిలేస్తారు

### ☛ లాభాలు వస్తేనే పనులు చేస్తాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో గత రెండేళ్ల కిందట సాధారణ, ఇతర నిధుల కింద దాదాపు రూ.3 కోట్లకు పైగానే మంజూరు చేశారు. ఈ నిధులతో దాదాపు 36 పనులకు టెండర్లు పూర్తి చేసి గుత్తేదారులకు అప్పగించారు. కానీ ఇంతవరకు పనులు చేపట్టలేదు. అధిక లాభాలు వచ్చే పనులు చేపట్టి.. అంతంత మాత్రంగా లాభాలు వచ్చే పనులను పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. గుత్తేదారులకు నోటీసులు జారీ చేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగానే చర్యలు చేపట్టి వదిలేస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందనంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

◆ పట్టణంలోని జోగి కాలనీలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, కాల్వలు నిర్మాణం పనులు గుత్తేదారులకు అప్పగించి ఏడాది దాటింది. ఇంత వరకు కనీసం మట్టి పనులు కూడా చేయలేదు. వర్షం వస్తే చాలు నీరు ఇళ్లలో చేరుతుంది దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ శివన్ననగర్ కాలనీలో రూ.24 లక్షలతో సీసీ రోడ్డు పనులను దక్కించుకున్నారు. ఏడాదిన్నరగా పనులకు మోక్షం లభించలేదు. వైకాపా ప్రభుత్వం మారడంతో ఆ గుత్తేదారులు ఊసేలేదు.

◆ 23వ వార్డులో బుడగంజాల కాలనీలో చిన్నపాటి వర్షం వచ్చిన నీటి మడుగును తలపిస్తోంది. రూ.24లక్షలతో సీసీ డ్రైనేజీ, సీసీ కాల్వల పనులను గుత్తేదారులు దక్కించుకున్నారు. రెండేళ్లవుతున్నా పనులు చేయలేదు.

◆ మునెప్పనగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, కోర్డు వెనుక కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, వెంకటాపురం కాలనీలో రూ.10లక్షలతో డ్రైనేజీ, అయ్యప్ప స్వామి ఏరియాలో రూ.12 లక్షలతో డ్రైనేజీ పనులకు టెండర్లు దక్కించుకొని మూడేళ్లు దాటినా ఇంత వరకు పనులు చేపట్టలేదు.

◆ పట్టణంలోని మునెప్పనగర్‌లో రూ.10 లక్షలు, అబ్బాస్ టాకీస్ ఏరియాలో రూ.15లక్షలు, టోపయ్య గుడి సమీపంలో రూ.15లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి కర్నూలుకు చెందిన ఒక గుత్తేదారుడు వైకాపా నేతల సహాయంతో టెండర్లు దక్కించుకున్నారు. రెండేళ్లు దాటినా పనులు చేపట్టలేదు.

### ఏడాదిన్నర కావస్తున్నా...

పట్టణంలోని ఎంబీ చర్చి నుంచి కలుగట్ల రహదారి వరకు పడిన రెండు ప్యాచ్ మరమ్మతులకు రూ.40 లక్షలతో టెండర్లు దక్కించుకున్నారు. ఏడాదిన్నర అవుతున్నా పనులు మొదలు పెట్టలేదు. గుంతల పడిన రహదారిలో రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పట్టణంలో ఎంబీ చర్చి నుంచి కలుగట్ల రహదారి వరకు పడిన గుంతలు

### పదేళ్లుగా గుంతలు పడి..

15వ వార్డులోని రహదారి గుంతలమయంగా మారింది. సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు తరచూ ఆందోళన చేపట్టారు. దీంతో రూ.10 లక్షల నిధులు మంజూరు చేసి అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే రెండేళ్లైనా గుత్తేదారులు పనులు చేపట్టలేదు. కాలనీ ప్రజలు ఎమ్మెల్యేలకు విన్నవించిన ఫలితం లేదు



15వ వార్డులో వదిలేసిన సీసీ రహదారి

| | |
|---|---|
| వార్డులు | : 34 |
| జనాభా | : 1.23లక్షలు |
| అభివృద్ధికి నోచుకోని కాలనీలు | : 17 |
| ప్రస్తుతం నిలిచిపోయిన పనులు | : 18 |
| పనుల విలువ | : రూ. 2.10కోట్లు |

### గుత్తేదారులకు తాఖీదులు జారీ చేస్తాం

**- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు**

పనులపై నిర్లక్ష్యం చేసిన గుత్తేదారులకు నోటీసులు జారీ చేస్తాం. పనులు చేపట్టకుండా వదిలేస్తే బ్లాక్‌లిస్టులో పెట్టి చర్యలు చేపడతాం. పనుల టెండర్ల ప్రక్రియ ప్రకారం పూర్తి చేయాలి. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు.

## కోఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్‌గా గట్టు అల్తాఫ్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : కో ఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్‌గా గట్టు అల్తాఫ్‌ను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. ఎమ్మిగనూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కోఆపరేటివ్ స్టోర్ డైరెక్టర్లుగా రాఘవేంద్ర, వడ్డె రవి, లక్ష్మన్నను



అల్తాఫ్‌ను సన్మానించిన సభ్యులు

ఎంపిక చేసినట్లు చెప్పారు. పార్టీ కోసం విశిష్ట సేవలు అందించినందుకు ఎంపికచేసినట్లు చెప్పారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు నామినేటెడ్ ఉద్యోగాలు, సముచిత న్యాయం కల్పిస్తామన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

కోసిగి, న్యూస్‌టుడే : కోసిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శి ఈరేష్ పేర్కొన్నారు. కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నతంగా లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు విజయనగరం జిల్లాలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం విజయవంతం చేయాలని పురపాలక సంఘం కమిషనర్



పురపాలక సంఘం కమిషనర్ గంగిరెడ్డి, తదితరులు

గంగిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరులో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ వాహనాల మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల గొడవపై విచారణ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల మధ్య జరిగిన గొడవపై డీసీహెచ్‌ఎస్ మాధవి బుధవారం విచారణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. వైద్యులు విధుల కేటాయింపులో నిబంధనలు పాటించకపోవడంతో పలువురు సీఎంవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు విచారణ చేసి నివేదికను సీఎంవో కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకురాలు మైత్రేయి సస్పెండ్ అయ్యిందా అని మీడియా ప్రతినిధులు అడగగా ప్రభుత్వం సస్పెండ్ చేసిందంటా అంటూ నర్మగర్భంగా చెప్పారు. ప్రభుత్వం సస్పెండ్ ఆర్డర్ తమకు అందలేదని అందితే దాన్ని ఫార్వర్డ్ చేస్తామన్నారు. ఏఐవైఎఫ్, విద్యార్థి సంఘాల నాయకులు పర్యవేక్షకురాలికి వ్యతిరేకంగా ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వర్షం.. మిరప రైతుకు దుఃఖం



మంత్రాలయం మండలంలో సూగూరు గ్రామంలో గత రెండ్రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోతున్నాయని మిరప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 70 లక్షల రూపాయలు ఖర్చు పెట్టి 70 రోజుల పెంచిన మిరప పంట, పచ్చి మిరపకాయలు దెబ్బతినడంతో రైతన్నలు కన్నీటిపర్యంతమయ్యారు. – న్యూస్‌టుడే, (మంత్రాలయం) సూగూరు

## రోడ్లు జలమయం



ఎమ్మిగనూరులో గత రెండ్రోజులు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని అన్నమయ్య కూడలి, లక్ష్మణ్ థియేటర్ వెనుక కాలనీ, మునెప్ప నగర్, సోమప్పనగర్, మైనారిటీ కాలనీలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. శివన్ననగర్ కాలనీలో మూడో వీధి శివారులో నీరు ఇళ్లలోకి చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల ఆవరణలో నీరు నిలిచి విద్యార్థులు అవస్థలు పడ్డారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

## విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

కోసిగి, న్యూస్‌టుడే : ఆసుపత్రికి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయమై స్టాఫ్‌నర్స్‌ను విచారణ చేసి చర్యలు తీసుకుంటామని మండల వైద్యాధికారి మనోజ్ కుమార్ బుధవారం తెలిపారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్ రాఘవేంద్ర అక్రమ వసూళ్లు చేస్తున్నారని బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం ఈనాడులో 'ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్యాధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## లింగాకర్షక బుట్టలతో.. పురుగు నివారణ



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ మహ్మద్‌ఖాద్రి

గోనెగండ్ల, న్యూస్‌టుడే : పత్తి పంటలో లింగాకర్షక బుట్టలతో గులాబిరంగు పురుగును నివారించుకోవచ్చని ఏడీఏ మహ్మద్ ఖాద్రి పేర్కొన్నారు. మండలంలోని పెద్దమర్రివీడు, చిన్నమర్రివీడు గ్రామాల్లో వ్యవసాయాధికారిణి హేమలత ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జి రామానాయుడు, మణిరాజ్, రైతులు శ్రీనువాసులు, లక్ష్మన్న, నరసన్న పాల్గొన్నారు.

బురాన్‌దొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే : ఆయిల్ పాము పంటల సాగుద్వారా మంచి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

ఆదాయాన్ని పొందవచ్చని ఆసక్తి గల రైతులు ముందుకు రావాలని కోడుమూరు ఉద్యానవనం శాఖాధికారి మదన్‌మోహన్ పేర్కొన్నారు. మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన రైతులతో మాట్లాడారు. ఎంపీఈవో వ్యవసాయ సహాయకుడు మారెప్ప రైతులు పాల్గొన్నారు.

రాంపురం (మంత్రాలయం), న్యూస్‌టుడే : మండలంలోని రాంపురం, కగ్గల్లు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి జీరా గణేశ్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాలకు వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు జీరా గణేశ్ తెలిపారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కంది పంటలో మొదటి పిచికారీకి వేపనూనెను వినియోగించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ సూచించారు. మండలంలోని వెంకటగిరి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, పశుసంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : పత్తిపంటలో లింగాకర్షక బుట్టలతో గులాబీరంగు పురుగు నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. మండలంలోని లింగాలదిన్నె గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## తెదేపా హయాంలో మైనారిటీలకు పెద్ద పీట

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం పాటు పడే సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరులో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మెల్యే నివాసంలో బుధవారం నిర్వహించి మైనారిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ముస్లిం మైనారిటీల వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. హజ్‌యాత్ర కోసం రూ. లక్ష ప్రకటించిందన్నారు.

☛ కర్నూలు హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రకటించడంపై ఎమ్మెల్యే న్యాయవాదుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. న్యాయవాదులు రామకృష్ణ నాయుడు, రషీద్, నర్సిరెడ్డి, నారాయణ, సల్మాన్, గురుప్రసాద్, ముస్లిం నాయకులుపాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తీర్చేందుకు అక్టోబరు నుంచి నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నెలలో ఒక రోజు ప్రజాదర్బార్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడే అధికారులతో సమస్య పరిష్కరిస్తామన్నారు.

## గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తాలూకా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఎంఈవో మధుసూదన్‌రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు అస్లాంబాషా, గోపాల్, సత్యనారాయణ, బజారప్ప,సతీశ్ పాల్గొన్నారు.

## రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత లేదని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు వీరేశ్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన రీడర్స్‌తో కలిసి ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని వినతిపత్రం అందజేశారు. నాయకులు చంద్రశేఖర్, ఉరుకుంద, భీమేష్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి హామీ నెరవేరుస్తాం

నందవరం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీ నెరవేరుస్తామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇబ్రహీంపురం, నదికైరవాడి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మాట్లాడారు. ఆయా శాఖ అధికారులు, తెదేపా, తెలుగుయువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వందరోజుల్లోనే ప్రజలకు భరోసా

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే భవిష్యత్ పట్ల ప్రజలకు భరోసా ఇచ్చిందని తెదేపా మండలాధ్యక్షుడు, వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్



కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా మండలాధ్యక్షుడు, వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉలిగయ్య

ఉలిగయ్య పేర్కొన్నారు. మండలంలోని హాల్వి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం భాగంగా బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు కురువ నాగేష్, సోము, వడ్డె ఉసేని, సిద్ధప్ప, భాజపా నాయకుడు మెహబూబ్ బాషా పాల్గొన్నారు.

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే : మండలంలోని మాధవరంలో ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా బుధవారం తెదేపా నేత రఘునాథ్‌రెడ్డి నాయకులతో కలిసి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం అమడగుంట్ల సర్పంచి వరలక్ష్మి సచివాలయ సిబ్బంది, తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి స్టికర్లను అతికించి, కరపత్రాలను అందచేశారు.

## ఎస్టీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గూడూరులోని నీలి షికారీలకు ఎస్టీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని నక్కల షికారీ సంఘం మండలాధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు. గూడూరు తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నీలి షికారీలకు ఎస్టీ రిజర్వేషన్ ఉన్నా గూడూరులో మాత్రం ఎస్టీలుగా గుర్తించడం లేదన్నారు. తహసీల్దారు కె. రామాంజనేయులకు వినతిపత్రం ఇచ్చారు.

## కుల ధ్రువపత్రాలు ఇవ్వొద్దు

మంత్రాలయం, న్యూస్‌టుడే : మాల, దాసరి కులాలకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు ఇవ్వకూడదని జైభీం ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన నాయకులతో కలిసి జైభీం ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గాడిమోడి నరసింహులు ఆధ్వర్యంలో మంత్రాలయం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి రత్నం, మాలమహానాడు నరసన్న, గర్జి ప్రకాశ్, అజయ్, నరసింహులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చెకుముకి పోటీలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే : గోనెగండ్లలోని కస్తూర్బాగాంధీ, ఉన్నత, ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం తెలిపారు. ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న ,యూటీఎఫ్ నాయకులు గుమ్మలబాబు, మణికుమారి పాల్గొన్నారు.

## వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,970

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ. 6,970, మధ్యస్థ ధర రూ. 4,560, కనిష్ఠ ధర రూ. 3,300కు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ. 5,702, మధ్యస్థ ధర రూ. 5,630, కనిష్ఠ ధర రూ. 5,040 పలికింది.

# మత్తు పదార్థాల కట్టడికి చర్యలు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : మత్తు పదార్థాలు, కర్ణాటక మద్యం వంటి కట్టడికి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు శ్రీకారం చుడతామన్నారు. ఉప విభాగంలోని పలు అంశాలపై డీఎస్పీతో ముఖాముఖి.



ఉపేంద్రబాబు, డీఎస్పీ, ఎమ్మిగనూరు

### విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం

◆ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై కళాశాల, పాఠశాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. మత్తు పదార్థాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కట్టడి చేస్తాం. యువత సామాజిక బాధ్యత కలిగి ఉంటూ మంచి నడవడికతో మెలిగితే కుటుంబంతో పాటు సమాజంలో వారికి మంచి పేరుంటుంది.

### గ్రామాల వారిగా గుర్తిస్తాం

కర్ణాటక మద్యం కట్టడికి ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేసుకొని వాటిని విక్రయించే వారిని గ్రామాల వారిగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కర్ణాటక మద్యం సరఫరా ప్రాంతాల్లో నిఘా పెంచుతాం. గ్రామస్థుల సహకారం తీసుకొని నిర్మూలించేందుకు ముందుకు సాగుతాం. మద్యం తాగడం వల్ల ఆరోగ్యం, ఆర్థికంగా కలిగే నష్టాలు కుటుంబాలు ఛిద్రంతో పిల్లల భవిష్యత్తుపై పడే ప్రభావం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

### నేరగాళ్ల వలలో పడకుండా అవగాహన

చరవాణిలకు వచ్చే సంక్షిప్త సమాచారాలు తదితర వాటిని తెరవకుండా జాగ్రత్తగా వహించాలి. కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి లింకులు ఓపెన్ చేయించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దొంగిలిస్తారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాం.

### ◆ డీఎస్పీతో ముఖాముఖి

### బందోబస్తు పెంచుతాం

దొంగతనాలు జరగకుండా రాత్రి పూట బందోబస్తు పెంచుతాం. గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఉంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ఇళ్లను బాడుగకు ఇచ్చే ముందు వారి గురించి బాగా తెలుసుకొని బాడుగకు ఇవ్వాలి. ప్రజలు దొంగతనాలు గురవకుండా అవగాహన కల్పిస్తాం.

### పల్లె నిద్ర కార్యక్రమాలు

ఉప విభాగంలో సమస్యాత్మక గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టేందుకు శ్రీకారం చుడుతాం. గ్రామాల్లో సభలు పెట్టి గొడవలతో ఎలా నష్టపోతారో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అక్షరాస్యత పరంగా వెనుకబడిన పల్లెల్లో చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తాం. గొడవలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచుతాం.

## చికిత్స పొందుతూ మృతి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : మండలంలోని కల్లుకుంట గ్రామానికి చెందిన ఖాదర్‌బీ(25) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన ఖాదర్‌బీ కర్నూలు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## యువతి అదృశ్యం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : మండలంలోని కల్లుకుంట గ్రామానికి చెందిన చాకలి నాగమ్మ(19) బుధవారం అదృశ్యమైందని ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్, పద్మావతి దంపతుల కుమార్తె నాగమ్మ ఉదయం 5 గంటలకు బహిర్భూమికి వెళ్లి తిరిగిరాలేదని తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## ఇద్దరిపై కేసు నమోదు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : మండలంలోని నాగులాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ తలారి ఈరన్నపై అదే గ్రామానికి చెందిన బోయ నరేంద్ర, బోయ వీరేశ్ పొలం వద్ద కాలువ పూడిక తీసే విషయంలో గొడవ పడి దాడి చేయడంతో ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

కోసిగి, న్యూస్‌టుడే : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య పేర్కొన్నారు. కోసిగి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం చెకుముఖి పోటీలు నిర్వహించారు. శంకరయ్య మాట్లాడుతూ.. ఈ పరీక్షలు రాసిన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక మెరుగైన ప్రతిభను వెలికితీస్తుందన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారు మండల స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పోషకుల సంక్షేమానికి పోరాడుతాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : గొర్రెల సంక్షేమం కోసం పోరాటాలు చేస్తామని గొర్రెల, మేకల పోషకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. ఎమ్మిగనూరులో బుధవారం నిర్వహించిన గొర్రెల, మేకల సంఘం జిల్లా నాయకుల



మాట్లాడుతున్న గోవిందు

సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఛైర్మన్, వైస్ ఛైర్మన్, 12 మంది డైరెక్టర్ల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 26 న కానుందని, అక్టోబరు 22 న ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏపీ గొర్రెల మేకల సంఘం గౌరవ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్, అధ్యక్షులు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## దీన్ దయాళ్ జయంతి వేడుకలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గూడూరులోని భాజపా కార్యాలయంలో భాజపా మండలాధ్యక్షుడు గోరంట్ల ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్ నాయుడు, రమేష్, శివ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన వరద ప్రవాహం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఎగువన వర్షాలు కురవడంతో సుంకేసుల జలాశయానికి 15,882 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని జలాశయ ఇంజినీరు రాజు బుధవారం తెలిపారు. జలాశయ 3 గేట్లు ఎత్తి దిగువకు 15,882 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జలాశయంలో 1.235 టీఎంసీల నీరు నిలువ ఉన్నాయన్నారు.

## ఎస్పీ బాలుకు ఘన నివాళి


బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంగీతానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గాయకుడు ప్రకాష్, బాలవెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతారావు, యాగంటేశ్వరయ్య, సంగా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు

•కర్నూలు •పాణ్యం

## 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారిణి విజయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీఆర్ మహిళా కళాశాలలో నిర్వహించే వేడుకల్లో స్వతంత్ర్య సమరయోధుల సంబంధీకులు, కళాకారులను సన్మానిస్తామన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, **సమస్య:** బుధవారపేటలోని వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయక వ్యర్థాలు పేరుకుపోయాయి. – స్థానికులు

**సమస్య:** శరీన్‌నగర్‌లో కుక్కల బెడద అధికంగా ఉంది. మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. – స్థానికులు

**సమాధానం:** సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – నగరపాలక అధికారులు

కర్నూలు నగర పాలక సంస్థ: సమస్య: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – రాజేశ్, స్థానికుడు

**సమస్య:** బుధవారపేటలోని వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయాలి. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. – స్థానికులు

**సమాధానం:** సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక అధికారులు

## నగర పాలక ఎస్‌ఈగా జి.రాజశేఖర్

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం నూతన ఎస్‌ఈగా జి. రాజశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఈఈ, డీఈ, ఏఈలు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.


## క్రీస్తు బోధనలు అనుసరణీయం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: క్రీస్తు బోధనలు అనుసరణీయమని రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తెలిపారు. వీరభద్రనగర్‌లో ప్రభ పరిశుద్ధ మందిరం పేరుతో నూతనంగా నిర్మించిన ప్రార్థన మందిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోహాను, సత్యరాజ్, నాగరాజు యాదవ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## అనాథలకు మంచి భవిష్యత్తుకు కృషి

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: అనాథలను గుర్తించి మంచి భవిష్యత్తు కల్పించి ప్రయోజకులను చేసేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. శాశ్వత లోక్‌అదాలత్ వెంకటహరినాథ్, దిశా డీఎస్పీ శ్రీనివాసాచారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ జుబేదా బేగం పాల్గొన్నారు.

# రెవెన్యూ సంఘం నాయకుడి బదిలీలీలలు




కర్నూలు సచివాలయం, కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో బదిలీల ప్రక్రియ రోజుకో మలుపు తిరుగుతోంది. బదిలీల గడువు ముగిసినా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. మూడు రోజుల కిందట మండలాల వారీగా బదిలీల జాబితా విడుదల చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న స్థానం నుంచి మరో స్థానానికి దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరిని ఎక్కడా నియమించలేదు. అలాంటి వారంతా కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదని, మొదటి విడత విడుదల చేశాం, చాలా మంది నిరీక్షిస్తున్నారు, వారందరికీ త్వరలో రెండో విడత జాబితా విడుదల చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

### ఆ సంఘానికి గుర్తింపు లేదు

గుర్తింపు ఉన్న సంఘాల నాయకులకు మాత్రమే బదిలీల నుంచి మినహాయింపు ఉంది. ఆఫీస్ బేరర్‌గా గుర్తింపున్న సంఘంలో రిటెన్షన్ అడగవచ్చు. కోరిన స్థానంలో పోస్టింగ్ వేయడానికి అవకాశం లేదు. ఓ రెవెన్యూ సంఘం నాయకుడు మూడేళ్ల కిందట ఓ లాడ్జిలో కూర్చొని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పేరుతో బోగస్ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం కార్యదర్శిగా చెప్పుకొంటున్న ఉద్యోగి గుర్తింపు లేని సంఘం పేరుతో తిరిగి కల్లూరుకు బదిలీ చేయించుకుంటారని వీఆర్వోల సంఘం నాయకులు మండిపడుతున్నారు.

### ఆ ఒక్కరిని తిప్పుకొంటున్నారు

కల్లూరు అర్బన్ గ్రేడ్-2 వీఆర్వో తనను కల్లూరు మండలంలోని కె. మార్కాపురానికి బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. బదిలీ చేయకుండా కాళ్లరిగేలా తిప్పుకొంటున్నట్లు సమాచారం. గ్రేడ్-2 వీఆర్వోలకు కల్లూరు మండలంలో వివిధ గ్రామాలకు పోస్టింగులు ఇచ్చారు. కె.మార్కాపురానికి నియమించేందుకు అవకాశమున్నప్పటికీ, కావాలనే ఆయనకు పోస్టింగ్ ఇవ్వడం లేదనే చర్చ సాగుతోంది. అయితే సదరు గ్రేడ్-2 వీఆర్వోకు రెండో జాబితాలో బదిలీ చేస్తామని కలెక్టరేట్ రెవెన్యూ అధికారి చెప్పడం గమనార్హం.

### ఆ రూ.5 లక్షల మంత్రం పని చేసిందా?

కల్లూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల వీఆర్వోలను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోను కోడుమూరు మండలం అనుగొండకు బదిలీ చేశారు. అయితే రెండు రోజులు తిరక్కముందే వీఆర్వోల సంఘాన్ని అడ్డం పెట్టుకుని ఓ రెవెన్యూ సంఘం నాయకుడు అధికారుల దగ్గర కూర్చొని ఆ వీఆర్వోను తిరిగి కల్లూరు బదిలీ చేయించారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో ఆ సంఘం నాయకుడికి సదరు వీఆర్వో రూ.5 లక్షల సమర్పించుకున్నారని కల్లూరు, కర్నూలు మండలాల్లో చర్చ సాగుతోంది.

### తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ చేసి...

ఇటీవల ఆ వీఆర్వో కల్లూరులో ఓ ఎఫ్ఎంసీ (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్) జారీ చేసే విషయంలో రూ.2 లక్షలు తీసుకొని అనర్హులకు ధ్రువపత్రం జారీ చేశారనే ఆరోపణలున్నాయి. ఆయనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కోడుమూరు మండలం అమడగుండ్ల నుంచి తిరిగి కల్లూరు వీఆర్వోగా బదిలీ చేయడం గమనార్హం. సదరు వీఆర్వో సాధారణ బదిలీలకు నెలన్నర రోజుల ముందు నుంచి తనను కల్లూరులో కొనసాగించేలా చూడాలని నాయకులకు రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించారు. అంత బాహాటంగా ఎలా ప్రకటిస్తారని అందరూ అవాక్కయ్యారు.

### మార్పులు, చేర్పులకు యత్నాలు

కల్లూరు మండలం ఉలిందకొండకు వీఆర్వోగా పద్మను నియమించారు. కర్నూలు అర్బన్ వన్ టౌన్ ఏరియాకు వలిబాషాను నియమించారు. అయితే రెవెన్యూ సంఘం నాయకుడు తనకు పనిభారం అవుతుందని భావించి, ఉలిందకొండకు నియమించిన వీఆర్వో పద్మను కర్నూలు అర్బన్ వన్ టౌన్ ఏరియాకు, ఇక్కడ నియమించిన వలిబాషాను ఉలిందకొండ గ్రామానికి బదిలీ చేయించేందుకు ముమ్మర యత్నాలు సాగుతున్నాయి. వలిబాషా ఇదివరకే ఉలిందకొండలో పని చేశారు. ఉన్నతాధికారులు సైతం ఆయనపై చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు.

## స్వీయరక్షణకు దాడి చేసిన కేసులో నాలుగేళ్ల శిక్ష

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: స్వీయ రక్షణ కోసం దాడి చేసి ఓ వ్యక్తి మృతికి కారణమైన కర్నూలు మండలం బి.తాండ్రపాడు ప్రజానగర్‌కు చెందిన బోయ నాగరాజుకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి.దివాకర్ తీర్పు ఇచ్చారు. చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవించే బోయ నాగరాజుకు తల్లిదండ్రులు లేరు. 2023 నవంబరు 29న రాత్రి సైకిల్‌పై వెళ్తూ బిర్లా గేటు వద్ద మూత్ర విసర్జన కోసం ఆగాడు. కల్లూరు మండలం ఉల్లిందకొండకు చెందిన మల్లెపోగు ప్రభాకర్ అకస్మాత్తుగా దాడి చేయగా బోయ నాగరాజు తనను తాను రక్షించుకునేందుకు ప్రతిఘటించి ఇటుకతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అటువైపు వెళ్తున్న తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా వెలిగొండకు చెందిన సూర్యచంద్రశేఖర్ తీవ్రంగా గాయపడిన మల్లెపోగు ప్రభాకర్‌ను గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సూర్యచంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ మురళీధర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడైన బోయ నాగరాజును అరెస్టు చేసి రిమాండుకు పంపారు. తనను తాను రక్షించుకునే క్రమంలో నేరం జరిగినట్లు కోర్టు విచారణలో తేలడంతో అతనికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

## జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి


ఫ్లోర్‌బాల్ రాష్ట్ర జట్టుతో అతిథులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: తమిళనాడులోని చెంగల్‌పట్టులో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు 18వ జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా రోయింగ్ సంఘం అధ్యక్షుడు డా.అరవింద్ రెడ్డి సూచించారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు దుస్తులను జిల్లా ఒలింపిక్ సంఘం నిర్వాహక కార్యదర్శి సునీల్‌కుమార్, జిల్లా ఫ్లోర్‌బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, జిల్లా రోయింగ్ సంఘం సభ్యుడు రాజేంద్రలతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్ర జట్టు జూనియర్ విభాగంలో అలేఖ్య, అఖిల, మోక్షిత, వీరేశ్, కార్తీక్, జాహ్నవి, రజితారాణి, సాయిప్రణవ్‌గౌడ్, కుశల్‌గౌడ్ ఉన్నారు.

## క్రీడా స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తే క్రీడాకారులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవచ్చని ప్రముఖ వైద్యులు డా.శంకర్ శర్మ పేర్కొన్నారు. ఆదర్శ విద్యా మందిరంలో అండర్-19 ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. డీఎస్ఏ స్టేడియంలో వాలీబాల్, హాకీ ఎంపిక పోటీలను డీవీఈవో వై. పరమేశ్వర్‌రెడ్డి, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపల్ లాలప్పలు ప్రారంభించారు.

## రాష్ట్ర స్థాయి అండర్-14 సబ్ జూనియర్స్ ఖోఖో జట్టు ఎంపిక

జె.పంగులూరు, న్యూస్‌టుడే : ఝార్ఖండ్ రాష్ట్రం షిండీగా పట్టణంలో ఈనెల 28 నుంచి అక్టోబరు మూడో తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల జట్టును బాపట్ల జిల్లా జె.పంగులూరు ఎంఎస్ఆర్. అండ్ బీఎన్ఎం. జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద ఎంపిక చేశారు. బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో అండర్-14 సబ్ జూనియర్స్ ఖోఖో క్రీడాకారుల జట్టు వివరాలను ఎస్ఆర్ఆర్ అకాడమీ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి వివరించారు. డి.బాజీవలి, వి.సాగర్, పి.వెంకటేశ్వర్లు, ఏ.శ్రీనివాస్, వి.నారాయణరెడ్డి, కె.వెంకటసాయి, (ప్రకాశం), పి.జ్యోతిరాము(అనంతపురం), ఎన్.భవానీశంకర్(కృష్ణ), డి.రవి(శ్రీకాకుళం), ఎస్.వీరేంద్ర(తూ.గో), బి.రామన్‌పాల్(గుంటూరు), ఆర్.బాలీజీ (కర్నూలు), సృతిక్‌సాయి(విశాఖ), ఎస్.బదిరీనాథ్(చిత్తూరు), ఎన్.గౌతమ్(నెల్లూరు) ఎంపికయ్యారు. వీరికి రూ.25 వేల విలువ చేసే క్రీడా సామగ్రి అందజేశారు.

## కంకర కనుమరుగు.. బురద మిగులు



వర్షాలకు నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణం బురదమయంగా మారుతుండటంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మట్టిని కంకరతో చదును చేయించినా వర్షాలకు కంకర కొట్టుకుపోయి బురద మిగిలింది. వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

## రహదారి.. మురుగు చేరి



కల్లూరు పట్టణం నిర్మల్‌నగర్ సమీపంలో మురుగు నీరు రహదారిపై పారుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకల సమయంలో మురుగు నీరు చిట్టుతుండటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా సమస్య పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

– కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే

## కాలనీ కబుర్లు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర పాలక పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. శరీన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు.

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: శరీన్‌నగర్‌లోని 71, 75వ వార్డు సచివాలయాలను నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు బుధవారం తనిఖీ చేసి ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలన్నారు.

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. నగర పాలక కౌన్సిల్ హాల్‌లో వివిధ పార్టీల ప్రతినిధులు, బీఎల్వోలతో తహసీల్దార్ వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొల్లంపల్లి తండాలో తెదేపా సీనియర్ నాయకుడు ఈవీ రమణ ఆధ్వర్యంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు.

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దటేకూరు ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి, తెదేపా నాయకుడు మహబూబ్‌బాషా బుధవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలిసి పెద్దటేకూరు, దొడ్డిపాడు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: రైతులు ఖరీఫ్ పంటల తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏవో సుధాకర్ సూచించారు. ఉప్పలపాడులో 'పొలం పిలుస్తోంది'లో భాగంగా పత్తి, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: స్థానిక 43వ వార్డు ఇందిరాగాంధీనగర్‌లో మురుగు కాల్వల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్ బుధవారం డిమాండు చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు చేయాలని పెయింటర్ కార్మికుల సంఘం పాతనగరం కార్యదర్శి ఖాజాపాషా డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు.

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని రైతు, సీఐటీయూ మండల సంఘాల కార్యదర్శులు కృష్ణ, మధు కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు.


కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల.దస్తగిరి పేర్కొన్నారు. మండలంలోని ఉల్చాలలో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాలకు సంబంధించిన స్టిక్కర్లను గోడలకు అతికించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. నాయకులు బుర్ర వెంకటేశ్‌నాయుడు, చంద్రశేఖర్, రాఘవేంద్ర, కుశాల్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని నంద్యాల జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుట్టపాడులో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించి పథకాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు జనార్దన్, స్వామిరెడ్డి, అయ్యస్వామి, పెద్దస్వామిరెడ్డి, పీఎస్ విజయపరిమళ పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలని డిమాండు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మధుసూదన్, మాసుం బాషా, బుగ్గ రాముడు, శివరాముడు పాల్గొన్నారు.

## మందులు అందించడంలో ఫార్మసిస్టులు కీలకం


కేక్ కట్ చేస్తున్న ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: రోగులకు మందులు అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా. ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. ఫార్మసిస్టుల దినోత్సవం పురస్కరించుకొని సర్వజన వైద్యశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరావు, డ్రగ్స్ స్టోర్ వైద్యాధికారిణి డా.శారద, ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో నిజాయతీ పెరగాలి: ఆర్పీ పట్నాయక్


సన్మానిస్తున్న ఆర్పీ పట్నాయక్, మాజీ ఎమ్మెల్యే నరసింహులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: సమాజంలో నిజాయతీ పెరిగేందుకు యువత ఉద్యమ స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. అవినీతిని నిర్మూలించడంలో యువత భాగస్వామ్యం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (వైఏసీ-కర్నూలు) విభాగం ఆధ్వర్యంలో బుధవారం కర్నూలులోని ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆర్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంపిక చేసిన 12 మంది నిజాయతీ ఉద్యోగులను ఆర్పీ పట్నాయక్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, వైఏసీ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి, సంస్థ జిల్లా బాధ్యుడు నారాయణ, డాక్టర్ స్రవంతి, కాంకర్ వృత్తి కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్, విశ్రాంత వ్యవసాయ అధికారి అశోక్ పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈకి వీడ్కోలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో ఈఈగా పదోన్నతి పొంది ఆదోనికి బదిలీ అయిన ఎ.పద్మజను బుధవారం కర్నూలులోని సర్కిల్ కార్యాలయంలో ఇంజినీర్లు, ఉద్యోగులు సత్కరించి వీడ్కోలు పలికారు. రెండేళ్లకుపైగా ఎస్ఈ పీఏగా విధులు నిర్వహించిన ఆమెకు అభినందనలు తెలిపారు. డీఈఈ అమల, ఏఈలు అనంత్, నూర్ అహ్మద్, దివ్య, దయామణి, రత్నకుమారి ఉన్నారు. ఎస్ఈ పీఏగా కర్నూలు డీఈఈ అమలకు అదనపు బాధ్యతలు అప్పగించారు.


ఈఈ పద్మజతో ఇంజినీర్లు



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు జి.రామకృష్ణ

## రైతులను నిర్లక్ష్యం చేయడం తగదు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతుల సమస్య పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదని ఏపీ రైతు సంఘం నాయకుడు జి.రామకృష్ణ అన్నారు. రైతుల సమస్యలపై కర్నూలు ఆర్డీవో కార్యాలయం ముందు మండల నాయకుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాల తరహాలో రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో శేషిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, వెంకటయ్య, లోకన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల రైతుల పొలాల్లో హైటెన్షన్ విద్యుత్తు టవర్లు వేస్తుండటంతో బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. ఓర్వకల్లులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రమేశ్, సుధాకర్, వెంకటేశ్వర్లు, అయ్యన్న పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు 'యూత్ ఫెస్ట్'లో భాగంగా గత నెల 24న ఐదు కి.మీ.ల రెడ్ రన్ మారథాన్ పోటీలు, ఈ నెల 11న పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో విజేతలకు డీఎంహెచ్‌వో భాస్కర్, జాతీయ హెల్త్ మిషన్ డీపీఎం డా.ఉమా చేతుల మీదుగా బుధవారం నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

## సూర్యనారాయణస్వామి ఆలయంలో పూజలు

కర్నూలు నగరం (ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: నగరంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో అష్టమి సందర్భంగా బుధవారం అనఘాష్టమి వ్రతం, పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గౌరీశంకర్‌స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

## పథకాల అమలులో విఫలం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీకృష్ణ విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయకులు సుధాకర్ బాబు, నగర అధ్యక్షుడు షేక్ జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వరనగర్, బాబా బృందావన్‌నగర్, రాఘవేంద్రనగర్‌లలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ బుధవారం పరిశీలించారు.

## అధ్వాన రహదారులు.. రాకపోకలకు అవస్థలు

■ రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం



కర్నూలు నగరంలోని రహదారులపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో రాకపోకలకు పట్టణవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వైకాపా హయాంలో రహదారులకు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మరమ్మతులు చేపట్టడంతో కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. నగరంలోని మురుగు కాలువలపై యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చిన్నపాటి వర్షానికే రహదారులపై మురుగు చేరుతోంది. ఇటీవల కర్నూలు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు నగరంలో పర్యటించి కాలువలపై ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

– కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

### మరమ్మతుల పేరుతో నిధుల పక్కదారి

నగరంలో ఉన్న 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల జనాభా నివాసం ఉంటోంది. నగర పరిధిలో సుమారు 900 కి.మీ.ల మేర సీసీ రహదారులు ఉన్నాయి. పలు వీధుల్లో రహదారులు అధ్వానంగా మారాయి. కొత్తగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో గుంతలు ఏర్పడటంతో నగరవాసులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారులకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. అప్పట్లో వైకాపా నేతలు నాడు-నేడు అంటూ హడావుడి చేశారు తప్ప ఎలాంటి పనులు పూర్తి చేయలేదు. రహదారులకు మరమ్మతుల పేరుతో దాదాపు రూ.1.5 కోట్ల నిధులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ గత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవడంతో పురవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### యథేచ్ఛగా కాలువల ఆక్రమణ

నగరంలోని మురుగు కాలువలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. కాలువలపై అక్రమార్కులు దర్జాగా నిర్మాణాలు చేపడుతుండటంతో పూడికతీత పనులకు తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి చిన్నపాటి వర్షానికి మురుగు రహదారులపై ప్రవహిస్తోంది. వీధుల్లోని కాలువలపై సైతం అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. కొంతమంది కాలువలను ఆక్రమించి మెట్లు, మరుగుదొడ్లను నిర్మించారు. కమిషనర్ ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినప్పటికీ అధికారులు ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టలేదని సమాచారం.



నగరంలోని నిర్మల్‌నగర్ సమీపంలో మురుగు కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇలా నగరంలోని పలు కాలనీల్లోని కాలువలపై యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టడంతో కాలువల్లో వ్యర్థాలు, పూడికతీత వంటి పారిశుద్ధ్య నిర్వహణ పనులు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయి.

కల్లూరు పట్టణం కృష్ణానగర్‌లో వైకాపా హయాంలో గుంతల రహదారులకు మరమ్మతులు చేపట్టారు. నాణ్యత లేకపోవడంతో కొన్ని రోజులకే రహదారులపై కంకర తేలడంతో అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రహదారుల కోసం నిధులు ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం లేకుండాపోయిందని ప్రజలు పేర్కొంటున్నారు.